thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com



మహోన్నత పార్లమెంటేరియన్ జగ్జీవన్ రామ్

ఏప్రిల్ 5...
బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

5

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 20 | కరీంనగర్ | ఆదివారం | 5 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## కేరళలో ఎల్‌డీఎఫ్‌కు ఉద్వాసన



**బీజేపీ విజయం ఖాయం**

**దక్షిణాది రాష్ట్రాల సీట్ల తగ్గింపుపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు**

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభా గాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమి స్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తా యని ఆయన పేర్కొన్నారు.



## హర్మూజ్ దాటిన ‘గ్రీన్ శాన్వీ’

స్పందించిన ఇరాన్ 4

## ఉగ్రకుట్ర భగ్నం

- నలుగురు ఉగ్రవాదుల అరెస్టు..


దేశంలో భారీ పేలుళ్ల ఉగ్రకుట్రను ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్లకు ప్రణాళికలు రచించిన నలుగురు నిందితులు సాకిబ్ అలియాస్ డెవిల్, వికాస్ గెహ్లావత్ అలియాస్ రౌనక్, లోకేశ్ అలియాస్ పాప్లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్‌ను ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) అరెస్టు చేసింది. వారికి పాక్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది.



4

## ఎన్నికల రాజకీయాలపై ‘పాతమాటే.!

- ఓట్ల రాజకీయాల వైపు చూడం
- ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తాం
- పూర్వ మావోయిస్ట్ మల్లా రాజిరెడ్డి




**చురకలు ప్రత్యేక ప్రతినిధి**

పార్లమెంటరీ రాజకీయాలు,ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం,పరిస్థితుల గురించి మాట్లాడడానికి ఇక్కడికి రాలేదని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ తెలిపారు. రాజిరెడ్డి తన బిడ్డ ప్రేమలత, అల్లుడు ఖాసిం తో కలసి శుక్రవారం ఉద యం మంథని కి వచ్చారు..

వివరాలు 4వ పేజీలో



# బాసర మాస్టర్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్

### రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు
- 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి మిగతా 2 లో

## ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి బీఆర్ఎస్ కైవసం

ఇబ్రహీంపట్నం ఛైర్మన్‌గా సుదర్శన్ రెడ్డి ఎన్నిక

క్యాతన్ పల్లి పీఠం దక్కించుకున్న సంధ్యారాణి

ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

బీఆర్ఎస్ కు మద్దతుగా నిలిచిన బీజేపీ, సీపీఐ



### ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

రణరంగంగా మారిన కార్యాలయం

వివరాలు 2వ పేజీలో

## పోలీస్ మామలు గ్రూపునకు ఎస్సై షాక్

బెడిసికొట్టిన మందుబాబుల ప్లాన్

వాట్సాప్ గ్రూప్‌తో తనిఖీలపై ముందే హెచ్చరికలు

ట్రాఫిక్ ఎస్ఐ ఎంటర్‌తో దొరికిపోయిన మోసం




నేను గోదావరిఖని మున్సిపల్ చౌరస్తాలో చెకింగ్ చేసస్తున్నాను, దమ్ముంటే రండిరా మామ చూసు కుందాం

.. వివరాలు 2లో



## మేడారం పూజారి కుమారుడికి పరామర్శ

ఘటనకు మంత్రులదే బాధ్యతన్న మధుసూధనాచారి

3



### పొంగులేటి మైనింగ్ స్కామ్ దృష్టి మళ్లింపు

అందుకే నాపై సీఐడీ విచారణ

పాడి కౌశిక్ రెడ్డి

.. వివరాలు 3లో

## కేసీఆర్ క్యాంప్ ఆఫీసుపై దాడి!

- క్షీణిస్తున్న శాంతిభద్ర తలకు నిదర్శనం
- మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు



2

## 6 నుంచి ఆరోగ్య వారోత్సవాలు

వారం రోజుల పాటు భారీ కార్యక్రమాలు!

ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహనే లక్ష్యం

మంత్రి దామోదర రాజనర్సింహ



### దివ్యాంగులకు అండగా నిలవాలి


- మీడియా అకాడమీ చైర్మన్



## తెలంగాణ సంపద కాంగ్రెస్ పాలు

- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫండ్ కోసం నిధుల మళ్లింపు
- గ్యారంటీలు, 66 హామీల పేరుతో ప్రజలకు మోసం
- ఎంపీ ఈటల రాజేందర్





# సింగరేణి కార్మికులకు శుభవార్త

## సహజ మరణానికి పదిలక్షల బీమా

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం దిశగా మరో కీలక అడుగు పడింది. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవతో, కార్మికులకు లభించే బీమా సౌకర్యం ఇప్పుడు మరింత విస్తృతమైంది. ఇకపై ప్రమాదవశాత్తు జరిగే మరణాలకే కాకుండా, సహజ మరణానికి కూడా రూ. 10 లక్షల ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. సాధారణంగా బ్యాంకులు ప్రమాద బీమాను మాత్రమే అందిస్తుంటాయి. అయితే, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం యూనియన్ బ్యాంక్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులందరికీ జీతాల ఖాతాలు అదే బ్యాంకులో ఉండటంతో, సామాజిక బాధ్యతలో భాగంగా ఈ అదనపు ప్రయోజనాన్ని కల్పించేందుకు బ్యాంక్ అంగీకరించింది.సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ నూతన బీమా విధానం ఈ నెల 1వ తేదీ నుండే అమలులోకి వచ్చింది. దీని కోసం కార్మికులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా ఉచితంగా అందించే సేవ. సింగరేణి వంటి కష్టతరమైన వృత్తిలో ఉన్న కార్మికులకు ఈ పథకం పెద్ద అండగా నిలవనుంది. విధి నిర్వహణలో కాకుండా, ఇంటి వద్ద సహజంగా మరణించినా వారి కుటుంబాలకు ఈ 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. ఇది కార్మిక కుటుంబాల్లో భరోసాను నింపుతోంది. సింగరేణి చరిత్రలో ఇలా సహజ మరణానికి కూడా భారీ మొత్తంలో బీమా వర్తించడం ఇదే తొలిసారి అని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యాజమాన్యం , యూనియన్ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మికుల నుండి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# పోలీస్ మామలు గ్రూపునకు ఎస్సై షాక్

### బెడిసికొట్టిన మందుబాబుల ప్లాన్

### వాట్సాప్ గ్రూప్‌తో తనిఖీలపై ముందే హెచ్చరికలు

### ట్రాఫిక్ ఎస్ఐ ఎంటర్‌తో దొరికిపోయిన మోసం



**పెద్దపల్లి, ఏప్రిల్ 4:** డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మందుబాబులు వేసిన ఒక మాస్టర్ ప్లాన్ డైరెక్టుగా పోలీసులకే దొరికిపోయింది. పోలీసులు ఎక్కడెక్కడ చెకింగ్ చేస్తున్నారో ముందే సమాచారం తెలుసుకునేందుకు వారు ఏకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. అయితే, ఆ గ్రూప్‌లోకి నేరుగా ట్రాఫిక్ ఎస్ఐ ఎంట్రీ ఇవ్వడంతో మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. గోదావరిఖని ప్రాంతంలో కొంతమంది మందుబాబులు కలిసి 'పోలీస్ మామల స్క్వాడ్' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించారు. కేవలం ఇద్దరితో మొదలైన ఈ గ్రూప్, చూస్తూనే వేల మంది సభ్యులకు చేరుకుంది. ఈ గ్రూప్ ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే.. పట్టణంలో ఎక్కడైనా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుంటే, వెంటనే ఆ లొకేషన్ వివరాలను గ్రూప్‌లో షేర్ చేయడం. దీనివల్ల మందుబాబులు ఆ మార్గాల్లో వెళ్లకుండా ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుని పోలీసుల కళ్లు గప్పేవారు. ఇటీవల వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని సెల్ ఫోన్ తనిఖీ చేయగా ఈ వింత వాట్సాప్ గ్రూప్ వ్యవహారం బయటపడింది. ఆ గ్రూప్‌లోని మెసేజ్‌లను చూసిన స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ, వెంటనే అందులో ఒక సెల్ఫీ వీడియోను పోస్ట్ చేశారు. 'అరేయ్ మామ.. నేను ట్రాఫిక్ ఎస్ఐని రా మామ.. నా మీదే గ్రూప్ పెడతారా?' అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. 'నేను గోదావరిఖని మున్సిపల్ చౌరస్తాలో చెకింగ్ చేస్తున్నాను, దమ్ముంటే రండిరా మామ చూసుకుందాం' అని సవాల్ విసిరారు.ఆ వీడియోను చూసిన మందుబాబులు ఒక్కసారిగా హడలిపోయారు. వెంటనే గ్రూప్ నుండి లెఫ్ట్ అవ్వడం ప్రారంభించారు. అయితే ఎస్ఐ మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా.. 'ఎవరూ వెళ్ళిపోకండి, మీ అందరి నెంబర్లు సేవ్ చేసుకున్నాను, ఫోటోలు కూడా తీశాను. మీ అందరికీ త్వరలోనే ఒక స్పెషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ పెడతాను, అందరూ రండి' అని అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. మందుబాబుల 'స్మార్ట్ ప్లాన్' పోలీసుల చేతికి చిక్కడంతో ఇప్పుడు గోదావరిఖనిలో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. పోలీసులు సాంకేతికతను వాడుకుని మరీ మందుబాబుల ఆట కట్టించడంతో, ఇప్పుడు ఆ గ్రూప్‌లో ఉన్న సభ్యులంతా పోలీసులకు ఎక్కడ దొరికిపోతామో అని బిక్కుబిక్కుమంటున్నారు.

# రాష్ట్రేతర ఓటర్లకు ప్రభుత్వం శుభవార్త

## ఓటేయడానికి వెళ్లే ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు.. ఆయా రాష్ట్రాలకు చెందిన వారై ఉండి తెలంగాణలో నివసిస్తున్న ఓటర్ల కోసం ప్రత్యేక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు కార్మిక , ఉపాధి శాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్న అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఎవరైతే తెలంగాణలో ఉద్యోగ రీత్యా లేదా ఇతర పనుల నిమిత్తం స్థిరపడ్డారో.. వారందరికీ తమ సొంత రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈ వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఈ సెలవు కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాలకు కూడా వర్తిస్తుంది.

# బాసర మాస్టర్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని



దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.



# ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి బీఆర్ఎస్ కైవసం

## ఇబ్రహీంపట్నం ఛైర్మన్ గా సుదర్శన్ రెడ్డి ఎన్నిక.. క్యాతన్ పల్లి పీఠం దక్కించుకున్న సంధ్యారాణి

- ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు
- బీఆర్ఎస్ కు మద్దతుగా నిలిచిన బీజేపీ, సీపీఐ

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్ గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్ పర్సన్ గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. గత కొన్ని రోజులుగా ఉత్కంఠ రేపిన ఈ ఎన్నిక కోర్టు ఆదేశాల మేరకు శనివారం జరిగింది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలను చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి సుదర్శన్ రెడ్డి పోటీ చేయగా, కాంగ్రెస్ నుంచి ఆకుల యాదగిరి పేరును ప్రతిపాదించారు. మెజారిటీ సభ్యుల మద్దతుతో బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది.

### హస్తం పార్టీ ఆందోళన

ఎన్నిక సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముగ్గురు కౌన్సిలర్లపై కోర్టులో కేసు పెండింగ్ లో ఉన్నందున ఎన్నికను వాయిదా వేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 55 రోజులుగా క్యాంపు నిర్వహించిందని ఆరోపించారు. అయితే ఎన్నికల అధికారులు కాంగ్రెస్ అభ్యంతరాలను తోసిపుచ్చారు. కోర్టు ఆదేశాల మేరకే ఎన్నిక నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేసి ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు.

### క్యాతన్ పల్లి పీఠంపై గులాబీ జెండా

మంచిర్యాల జిల్లా క్యాతన్ పల్లి మున్సిపాలిటీని సైతం బీఆర్ఎస్ దక్కించుకుంది. ఇక్కడ ఛైర్ పర్సన్ గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గోడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. సీపీఐ మద్దతుతో ఆమె ఈ విజయం సాధించారు. వైస్ ఛైర్మన్ పదవిని సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత దక్కించుకున్నారు. క్యాతన్ పల్లిలో బీఆర్ఎస్, సీపీఐ పొత్తు పెట్టుకున్నాయి. మొత్తం 22 వార్డులకు గాను బీఆర్ఎస్ 10, సీపీఐ 4 వార్డుల్లో గెలుపొందగా, కాంగ్రెస్ 7 స్థానాలకే పరిమితమైంది.

### ముగిసిన ఉత్కంఠ

గతంలో కాంగ్రెస్ నేతల ఆందోళనల వల్ల క్యాతన్ పల్లి మున్సిపల్ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. చివరకు కోర్టు ఆదేశాలతో శనివారం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరు కాలేదు. బీఆర్ఎస్, సీపీఐకి చెందిన 14 మంది కౌన్సిలర్లు హాజరు కావడంతో కోరం ఉన్నట్లు అధికారులు గుర్తించి ఎన్నిక పూర్తి చేశారు. దీంతో సంధ్యారాణి ఛైర్ పర్సన్ గా, సరిత వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టనున్నారు. రెండు మున్సిపాలిటీలను బీఆర్ఎస్ గెలుచుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

# కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

### క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనం

### మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** ప్రతిపక్ష నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనమని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కేసీఆర్ కార్యాలయంపై దాడి చేయడం అంటే తెలంగాణ ప్రజల గౌరవంపై దాడి చేసినట్టేనని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత కార్యాలయంపై దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు హద్దులు దాటుతున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను భయపెట్టేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిని గుర్తించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారికి ప్రభుత్వం అండగా నిలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీపై ఎలాంటి అణచివేతలు చేసినా వెనక్కి తగ్గబోమని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై దాడులు ఆపాలని, తెలంగాణ గౌరవాన్ని కాపాడాలని సూచించారు.



# ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

## రణరంగంగా మారిన కార్యాలయం

- చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం
- అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ నేతల ఘర్షణ
- మాజీ మంత్రి జోగు రామన్న హౌస్ అరెస్ట్
- మున్సిపల్ ఆఫీస్ ముందు బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల ఆందోళన

**నిర్మల్, ఏప్రిల్ 04 (మనసులో మాట):** ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా కౌన్సిలర్ల మధ్య చోటుచేసుకున్న తీవ్ర వాగ్వాదంతో ఎన్నిక ప్రక్రియ వాయిదా పడింది. ఓటింగ్ కోసం చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దిగారు. అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో సందిగ్ధత నెలకొంది.

### ఎమ్మెల్యే వాకౌట్.. విపక్షాల నిరసన

మున్సిపల్ సమావేశం నుంచి ఎమ్మెల్యే బొజ్జు బయటకు వెళ్లిపోగా.. కార్యాలయం బయట బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే అధికారులను బెదిరిస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరగనివ్వడం లేదని నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్ ఛార్జి, మాజీ మంత్రి జోగు రామన్నను పోలీసులు ఆదిలాబాద్ లో ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఎన్నిక ప్రభావితం కాకుండా ఉండేందుకు పోలీసులు ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. తన అరెస్ట్ పై జోగు రామన్న తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి హోంశాఖను అడ్డం పెట్టుకుని ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని విమర్శించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక బీఆర్ఎస్ కు అనుకూలంగా ఉండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. రాజ్యాంగ నియమాలను



ఉల్లంఘిస్తూ పోలీసుల పహారా మధ్య ఎన్నికలు జరపాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు త్వరలోనే కాంగ్రెస్ కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



# 6 నుంచి ఆరోగ్య వారోత్సవాలు

## వారం రోజుల పాటు భారీ కార్యక్రమాలు!

### ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహనే లక్ష్యం : మంత్రి దామోదర

**హైదరాబాద్, ఏప్రిల్ 04:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'హెల్త్ వీక్' (ఆరోగ్య వారోత్సవాలు) నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ఈ వేడుకలు ఉండాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఒక ప్రత్యేక అంశంపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 6న 'ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే' సందర్భంగా ఉదయం నెక్లెస్ రోడ్ లో 'ఈట్ రైట్ వాక్', మధ్యాహ్నం నేచురోపతి ఆస్పత్రిలో మిల్లెట్ మేళా ఏర్పాటు చేస్తారు. ఆహార నిపుణులకు శిక్షణతో పాటు వీధి వ్యాపారులకు సర్టిఫికేట్ల పంపిణీ చేపడతారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం వేళ నిమ్స్ లో అత్యాధునిక 'లీనాక్' యంత్రాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అదే రోజు రవీంద్రభారతిలో తెలంగాణ క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్రామా కేర్ పాలసీని అందుబాటులోకి తెస్తూ.. కొత్తగా ఎంపికైన 871 మంది డాక్టర్లకు నియామక పత్రాలు అందజేస్తారు. ఏప్రిల్ 8న 'సేఫ్ మదర్ డే' నిర్వహిస్తూ గర్భిణులకు ఏఎన్ సీ పరీక్షలు, ప్రసూతి సేవలపై గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన కల్పిస్తారు. ఏప్రిల్ 9న ఎయిడ్స్ పై అవగాహన కోసం హైదరాబాద్ లో 'రెడ్ రన్', జైళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఉంటాయి. ఏప్రిల్ 10న 'హోమియోపతి, ఆయుష్ డే' సందర్భంగా ఉదయం యోగా ప్రదర్శనలు, హోమియోపతి కళాశాలలో రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహిస్తారు. వారోత్సవాల ముగింపు రోజైన ఏప్రిల్ 11న 'డ్రగ్ కంట్రోల్ డే' పాటిస్తూ మందుల సురక్షిత వాడకంపై అవగాహన, గాంధీ ఆస్పత్రిలో డీ అడిక్షన్ క్యాంప్ ఏర్పాటు చేస్తారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు కూడా నిర్వహిస్తారు. రాష్ట్ర ఆరోగ్య రంగ అభివృద్ధికి ఈ కార్యక్రమాలు దోహదపడాలని మంత్రి సూచించారు. విద్యార్థులు, మహిళలు, యువతను ఈ వారోత్సవాల్లో పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో హెల్త్ వీక్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మేడారం పూజారి కుమారుడికి పరామర్శ

### ఘటనకు మంత్రులదే బాధ్యతన్న మధుసూధనాచారి



**వరంగల్, ఏప్రిల్ 4:** మేడారం గద్దెల వద్ద గతనెల 25న జరిగిన ప్రమాదానికి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి , ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. హన్మకొండలో ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సమ్మక్క పూజారి కుమారుడు యువన్‌ను వారు పరామర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బాలుడికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. మంత్రి సీతక్క వచ్చి పరామర్శించి రూ. 10వేలు చేతిలో పెట్టి వెళ్లి ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. మంత్రులు ఇప్పటివరకు బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. బాలుడికి అయ్యే వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించి, అతడి భవిష్యత్ కోసం కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుడి తల్లిదండ్రులకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

# పొంగులేటి స్కామ్ దృష్టి మళ్లింపు

### అందుకే తనపై సీఐడీ విచారణ : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 4:** ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసు విధులకు భంగం కలిగించడం, రెచ్చగొట్టే వాఖ్యలు చేసిన కేసులో.. కౌశిక్ రెడ్డి శనివారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విచారణ అనంతరం ప్రభుత్వం, పోలీసులపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తనను, తన కుటుంబాన్ని రాజకీయంగా వేధించడానికి ఈ విచారణలు జరుపుతున్నారని ఆరోపించారు. సీఐడీ కార్యాలయం వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ వేశారు. ప్రజల పక్షాన పోరాడటానికి నేను దేనికైనా సిద్ధం. హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తెచ్చి హుజూరాబాద్‌లో వేస్తే ఊరుకోం. ఆ డంపింగ్ యార్డ్ కరోనా కంటే ప్రమాదం. ఈ విషయంలో నేను చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి విచారణ పేరుతో అడ్డుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీన హుజూరాబాద్‌లో దీక్షకు కూర్చుంటా. నేను మత మార్పిడిలపై వ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా' అని అన్నారు.

# కేసీఆర్ క్యాంప్ ఆఫీసుపై దాడి.. రేవంత్ ఆదేశమే

- గజ్వేల్ ఎమ్మెల్యే కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల వీరంగం
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు
- బీహార్ గ్యాంగ్ సంస్కృతిని తలపిస్తోందని మండిపాటు
- ఇందిరమ్మ రాజ్యమా.. గూండా రాజ్యమా అని నిలదీత
- నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డీజీపీకి డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 04 (మనసులో మాట):** ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యంపై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్ ను తలపిస్తోందని మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాలపైనే ముప్పేట దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్లా లేనట్లా అని ప్రశ్నించారు.

### ప్రైవేట్ సైన్యంలా పోలీసులు

శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా అని హరీష్ రావు నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటన్నారు. ఒకవైపు 'హేట్ స్పీచ్ బిల్' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ.. మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజాపాలన అని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు.

### పాలన గాలికి.. పర్యటనలే ముఖ్యం

ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేశారని హరీష్ రావు ఆరోపించారు. సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా అని అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి.. ఇప్పుడు ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని దుయ్యబట్టారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్న ఈ అణచివేతలకు, నిర్బంధాలకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు.

### నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ను అడుగడుగునా నిలదీస్తామని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని వివరించారు.

# తెలంగాణ సంపద కాంగ్రెస్ పాలు

- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫండ్ కోసం నిధుల మళ్లింపు
- ఆరు గ్యారంటీలు, 66 హామీల పేరుతో ప్రజలకు మోసం
- ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- ప్రజా సమస్యలు వదిలి వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యం
- ఎంపీ ఈటల రాజేందర్



**వరంగల్, ఏప్రిల్ 04 (మనసులో మాట):** తెలంగాణ ప్రజల సంపదను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఖర్చుల కోసం ఇక్కడి నిధులను కాంగ్రెస్ పార్టీకి తరలిస్తున్నారని మండిపడ్డారు. శనివారం వరంగల్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 66 హామీల పేరుతో ప్రజలను నమ్మించి వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఈ రెండున్నరేళ్లలో కేవలం 600 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేసిందని ఈటల ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల భవిష్యత్తుతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. చట్ట సభల్లో ప్రజా సమస్యల గురించి చర్చించకుండా కేవలం వ్యక్తిగత దూషణలతో సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. హామీల అమలు సాధ్యమా అని అడిగితే.. చేసి చూపిస్తానని ప్రగల్భాలు పలికిన రేవంత్, ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

### భూముల విక్రయాలపై సంచలన ఆరోపణలు

వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రైవేట్ వ్యక్తులతో చేతులు కలిపి అమ్ముకుంటున్నారని ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రజలు గంపెడు ఆశలతో అధికారం ఇస్తే.. రేవంత్ మాత్రం తెలంగాణ ఆస్తులను కొల్లగొడుతున్నారని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్ మెంట్ తో పాటు ఇతర సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రేవంత్ రెడ్డి వెంటనే తన ధోరణిని మార్చుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేశారు.

# దివ్యాంగులకు అండగా నిలవాలి

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి
- మానవ సేవే మాధవ సేవగా కృషి చేయాలి
- వైభవంగా మేధో దివ్యాంగుల పాఠశాల 36వ వార్షికోత్సవం
- పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం
- సీఎం రేవంత్ రెడ్డిని పాఠశాలకు ఆహ్వానిస్తాం
- స్వయం ఉపాధితో రాణిస్తున్న విద్యార్థులు



**కరీంనగర్, ఏప్రిల్ 4 :**

మానవ సేవే మాధవ సేవ అని, మానసిక శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులకు సేవ చేయడం వల్ల గొప్ప ఆత్మ సంతృప్తి కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్ ఎండీ కాలనీ మహాత్మా నగర్ లోని స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేధో దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల 36వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

### సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

జన్యు లోపాలతో మేధోపరమైన వెనుకబాటుతనం ఉన్న పిల్లల కోసం స్వాతంత్ర్య సమరయోధులు ముందుచూపుతో ఈ పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కేవీ నర్సింగరావు కృషితో వెలసిన ఈ పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాలకు ఒక దేవాలయం వంటిదని కొనియాడారు. మానసిక వైకల్యం ఉన్న పిల్లలను కన్నబిడ్డల్లా చూసుకుంటున్న టీచర్లు, ఆయాలు, సిబ్బందిని దేవుళ్లుగా ఆయన అభివర్ణించారు. చాడ వెంకట్ రెడ్డి తనకున్న పరిచయాలతో ఈ సంస్థను మరింత అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 50 లక్షలు కేటాయించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ పాఠశాల సమస్యలను తీసుకెళ్లి ఆయన ఇక్కడికి వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్వయం ఉపాధితో రోజుకు రూ. 500 సంపాదిస్తున్న విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

### అభివృద్ధి పథంలో పాఠశాల

ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. 1990లో 20 మందితో ప్రారంభమైన ఈ పాఠశాల నేడు 127 మందికి ఆశ్రయం కల్పిస్తోందని తెలిపారు. ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి రెండు ఎకరాల భూమి కేటాయించామని, తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 25 లక్షలతో భవనాలు నిర్మించామని గుర్తు చేశారు. ఐఏఎస్ అధికారిణి అనిత రామచంద్రన్ చొరవతో రూ. 26 లక్షల విలువైన బస్సు లభించిందని వివరించారు. నాప్కో సీఈఓ రాజు, ఎల్ వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వంటి దాతల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్ కూడా పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు.

### స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి

18 ఏళ్లు దాటిన విద్యార్థుల కోసం కొవ్వొత్తులు, విస్తరాకులు, సబ్బుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు వెంకట్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల స్థితిగతులను బట్టి స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, యోగా వంటి నైపుణ్యాలను నేర్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో 77 మంది వసతిగృహంలో ఉండగా, 50 మంది డేస్కాలర్ విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సదానందం గౌడ్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఇలాంటి పాఠశాల ఒకటి ఉండాలని కోరారు. ఆర్డీవో మహేశ్వర్ సిబ్బంది కృషిని అభినందించారు. చీఫ్ ఇంజనీర్ సుమతి దేవి ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం అందజేస్తానని ప్రకటించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్, సీనియర్ జర్నలిస్టులు మధుసూదన్ రెడ్డి, శేఖర్, ట్రస్ట్ సభ్యులు వెంకటయ్య, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.



# ఎన్నికల రాజకీయాలపై 'పాతమాటే.!

- ఓట్ల రాజకీయాల వైపు చూడం
- ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తాం
- పూర్వ మావోయిస్ట్ మల్లా రాజిరెడ్డి

చురకలు ప్రత్యేక ప్రతినిధి

పార్లమెంటరీ రాజకీయాలు,ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం,పరిస్థితుల గురించి మాట్లాడడానికి ఇక్కడికి రాలేదని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ తెలిపారు. రాజిరెడ్డి తన బిడ్డ ప్రేమలత, అల్లుడు ఖాసిం తో కలసి శుక్రవారం ఉదయం మంథని కి వచ్చారు..తాను పుట్టి పెరిగిన ప్రాంతంలో పర్యటించారు. ఇందు కోసమే వచ్చానని చెప్పారు.జనారణ్యంలోకి వచ్చిన ఆయన మొదటి సారి మంథనికి వచ్చారు. శనివారం మంథనికి చేరుకున్న ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకురాలు మూల సరోజన ఇంట్లో కొద్దిసేపు ఉన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ రాజిరెడ్డి శక్తి మేరకు ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. ఆ తరువాత స్వగ్రామమైన శాస్త్రుల్లపల్లికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసిన కొంతమంది తో మాట్లాడిన రాజిరెడ్డి తనకు పరిచయం ఉన్న వారి గురించి వాకబు చేశారు.

**రాజకీయాలకు దూరం...**

రాజకీయాలకు దూరంగా ఉంటానని, ఎన్నికల్లో పాల్గొనేది లేదని మల్ల రాజిరెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ పార్టీ పెట్టే ఉద్దేశ్యం కూడా లేదని కుండబద్దలు కొట్టారు. మంథనిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజా ఉద్యమాలు, సమాజ సేవలో భాగస్వామ్యం అయ్యే విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవల్సి ఉందన్నారు. ఈ ప్రతిపాదనను ఇప్పటికే ప్రభుత్వం ముందు ఉంచినట్టుగా వెల్లడించారు. చాలా కాలం పాటు విప్లవోద్యమంలో పని చేసి బయటకు వచ్చానని, బంధువులను కలిసేందుకు మాత్రమే వచ్చానని వెల్లడించిన ఆయన లీగల్ గా పని చేసేందుకు అనుమతిస్తే ఆలోచిస్తామన్నారు.

**46 ఏళ్లకు...**

46 ఏళ్ల తరువాత మల్ల రాజిరెడ్డి తన స్వగ్రామానికి వచ్చారు. 1999 జనవరిలో రాత్రి పూట వచ్చి వెళ్లానని ఆ తరువాత ఇప్పుడే వచ్చానన్నారు. తాను అన్ని విషయాలు అవసరమైనప్పుడు చెబుతానని తెలిపారు. అయితే లొంగిపోయిన తరువాత తమపట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా స్పందిస్తాయో చూడాలి అని ఆయన అన్నారు

# సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

**బాస్‌ల పేరుతో హానికరమైన మెయిల్స్**

**అప్రమత్తంగా ఉండాలని సిపి సజ్జనార్ హెచ్చరిక**



హైదరాబాద్,ఏప్రిల్4 ): వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. ఈ మేరకు వివరాలు వెల్లడిస్తూ ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని సీపీ తెలిపారు. సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని వెల్లడించారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో పై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైన్న ÷ర్‌వాల్స్, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు. వాట్సాప్ వెబ్ వాడిన ప్రతిసారి తప్పకుండా లాగౌట్ చేయడం మర్చిపోవద్దని తెలిపారు. సాంకేతిక భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే ఇటువంటి దాడులను ఎదుర్కోగలమని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సజ్జనర్ చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని వివరించారు

# అమిత్ షా పర్యటనలో ఘర్షణ

**సీరియస్‌గా తీసుకున్న ఇసి డిసిపి సహా ముగ్గురి సస్పెన్షన్**

న్యూఢిల్లీ,ఏప్రిల్4 : పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనలోనే అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 2న మంత్రి అమిత్ షా బెంగాల్‌లోని భవానిపూర్‌లో పర్యటించారు. అక్కడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ షో నిర్వహించారు. అయితే, ఈ రోడ్ షోలో ఘర్షణ వాతావరణం తలెత్తింది. బీజేపీ శ్రేణులు పాల్గొన్న ఈ రోడ్ షోలో టీఎంసీకి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరుపక్షాల మధ్య దాడి జరిగింది. సాధారణంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొనే కార్యక్రమాలకు కఠిన భద్రత ఉంటుంది. ఇలాంటి దాడులకు అవకాశం ఉండదు. కానీ, భవానిపూర్‌లో మాత్రం హింసాత్మక వాతావరణం ఏర్పడింది. దీంతో ఈ అంశంపై ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది. దీనిపై నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శిని ఈసీ కోరింది. ఈ నివేదిక ఆధారంగా ఈసీ చర్యలు తీసుకుంది. అమిత్ షా పర్యటనలో అనేక భద్రతా వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించింది. దీనికి బాధ్యుల్ని చేస్తూ సిద్ధార్థ్ దత్తా అనే డీసీపీ సహా మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. శాంతి భద్రతల్ని కాపాడటంలో వీరు విఫలమయ్యారని ఆరోపించింది.పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో భవానిపూర్ నియోజకవర్గం చాలా కీలకం. ఎందుకంటే ఇక్కడి నుంచి సీఎం మమతా బెనర్జీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. వీరిలో ఎవరు గెలిచినా సీఎం కావడం ఖాయం.

# భారీ ఉగ్రకుట్ర భగ్నం

**నలుగురు ఉగ్రవాదుల అరెస్టు..**



**ఢిల్లీ:** దేశంలో భారీ పేలుళ్ల ఉగ్రకుట్రను ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్లకు ప్రణాళికలు రచించిన నలుగురిని ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) అరెస్టు చేసింది. నిందితులకు పాక్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. నలుగురు నిందితులను సాకిబ్ అలియాస్ డెవిల్, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్, లోకేశ్ అలియాస్ పాప్లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్‌గా గుర్తించారు. పాకిస్థాన్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరంతా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరంతా దేశవ్యాప్తంగా పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పాకిస్థాన్ తీవ్రవాద గ్రూపులతో సంబంధాలు కలిగి ఉన్నట్లు విచారణలో ఏటీఎస్ పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు మీరట్‌కు చెందిన సాకిబ్ అలియాస్ డెవిల్ అని తెలిపారు. మిగిలిన ముగ్గురితో కలిసి దేశంలో అతను పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2న లక్నో రైల్వేస్టేషన్ వద్ద పేలుడుకు కుట్ర పన్నుతుండగా పక్కా సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై బీఎన్ఎస్, ఉపా చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలు, ఏడు స్మార్ట్ ఫోన్లు, 24 కర పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ నిందితులు కొన్ని ప్రదేశాల్లో చిన్నపాటి పేలుళ్లకు పాల్పడ్డారని.. దాన్ని వీడియో తీసి ఉగ్రసంస్థలకు పంపారని పోలీసులు తెలిపారు. దాని ద్వారా ఉగ్రసంస్థల నుంచి నిధులు సేకరించారన్నారు. వీరంతా సోషల్ మీడియాను ఉపయోగించి యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారన్నారు. రైల్వే సిగ్నల్స్, గ్యాస్ సిలిండర్ల ట్రక్కులు, ప్రభుత్వ కీలక ఆస్తులే లక్ష్యంగా దాడికి ప్లాన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వీరంతా రాజకీయ ప్రముఖుల ఇళ్లు, ప్రముఖ సంస్థల వద్ద రెక్కీ నిర్వహించారని.. ఆ సమాచారాన్ని పాకిస్థానీ హ్యాండ్లర్లకు పంపారని తెలిపారు. ఘజియాబాద్, అలీగఢ్, లక్నోతోపాటు ప్రముఖ ప్రదేశాల్లో వీరంతా సర్వే చేశారని పోలీసులు పేర్కొన్నారు.

# కేరళలో ఎల్‌డీఎఫ్‌కు ఉద్వాసన

- బీజేపీ విజయం ఖాయం
- దక్షిణాది రాష్ట్రాల సీట్ల తగ్గింపుపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**తిరువనంతపురం:** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్డీఏ) అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువల్ల మున్సిపాలిటీలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో కూడా నిజం లేదని స్పష్టం చేశారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు.

**మోదీ గ్యారెంటీ..**

ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. సబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**బావిలోకి దూసుకెళ్లిన కారు**

**ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి**



**ముంబై, ఏప్రిల్ 4:** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# ట్రంప్ నియంత్రణలో మోదీ

- ఆయన నియంత్రణలో పినరయి
- రాహుల్ గాంధీ విసుర్లు



**ఇడుక్కి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని, అత్యంత అవమైనకరమైన విషయం ఏమిటంటే ట్రంప్‌ను 'సర్' అని ఆయన పిలుస్తారని చెప్పారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలంలో ఉన్నానని అనుకుంటున్నారని విమర్శించారు. మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే పినరయి విజయన్‌ను మోదీ నియంత్రిస్తున్నారని అన్నారు. కేరళంలోని ఇడుక్కిలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, బీజేపీతో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కుమ్మక్కయిందని ఆరోపించారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్, లెఫ్ట్ ఫ్రంట్ మధ్య సంబంధాలను ఇవాళ ప్రతి ఒక్కరూ చూడొచ్చు. లెఫ్ట్ ఫ్రంట్‌లో సిద్ధాంతాల కోసం ఎళ్లతరబడి పనిచేసిన అవకాశవాదులు కాని కొందరు ఇప్పుడు తమను పార్టీ వంచించిందని ఆవేదన చెందుతున్నారు' అని రాహుల్ తెలిపారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కయినందునే ఎల్‌డీఎఫ్ తన వామపక్ష భావజాలాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ఎప్పుడూ సైద్ధాంతిక ప్రత్యర్థిగా ఎల్‌డీఎఫ్‌తో పోరాడేదని, ఇప్పుడు ఎల్డీఎఫ్ మారిపోయిందని, ఎల్‌డీఎఫ్‌లో 'లెఫ్ట్' అనేదే లేదని, ఎన్నికల తర్వాత అందులో ఏదీ మిగలదని అన్నారు. కేరళలోని ప్రభుత్వాన్ని ఒక చీకటి శక్తి ప్రభావితం చేస్తోందని, అది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజలపై దాడి చేస్తోందని పరోక్షంగా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి మోదీ ఏ రాష్ట్రానికి వెళ్లిగా మతం, ఆలయాలు గురించి మాట్లాడతారని, కేరళ అంశాల విషయానికి వచ్చేసరికి మాత్రం పెదవి విప్పరని శబరిమల బంగారం కేసును ప్రస్తావిస్తూ అన్నారు. ఎల్‌డీఎఫ్‌కు హెల్ప్ చేయాలని ఆయన అనుకోవడమే అందుకు కారణమని వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతున్నందున తనపై చాలా కేసులు పెట్టారని, ఇంటరాగేట్ చేశారని, అయినా కూడా తాను వెనుదీయలేదని చెప్పారు. మోదీ ప్రతిరోజూ తనపై విమర్శల దాడి చేస్తారని, కానీ కేరళ సీఎం గురించి కానీ, ఆయన కుటుంబం గురించి కానీ ఒక్క మాట మాట్లాడరని అన్నారు. జాతీయ అంశాలపై మోదీని ఎల్డీఎఫ్ ఎప్పుడూ సవాలు చేయకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. ఏప్రిల్ 9న కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# హర్మ్యూజ్ దాటిన 'గ్రీన్ శాన్వీ'.. : స్పందించిన ఇరాన్



**ఢిల్లీ:** గల్ఫ్ నుంచి ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన మరో నౌక 'గ్రీన్ శాన్వీ'.. హర్మ్యూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మరికొన్ని రోజుల్లో ఇక్కడికి చేరుకోనుంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ గుజరాత్ మంత్రి హర్ష్ సంఘ్వీ 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. దీనిపై ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ స్పందించింది. భారత్‌తో స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే విషయానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. "ఎల్పీజీ నౌక 'గ్రీన్ శాన్వీ' విజయవంతంగా హర్మ్యూజ్ జలసంధిని దాటింది. భారత దౌత్యానికి ఇది మరో విజయం" అని గుజరాత్ మంత్రి హర్ష్ సంఘ్వీ పోస్టు చేశారు. దీనిపై ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ స్పందిస్తూ.. "శతాబ్దాల క్రితం మా ప్రాంతం నుంచి వచ్చిన వారికి భారత్, ముఖ్యంగా గుజరాత్.. సాదరంగా స్వాగతం పలికాయి. మా చరిత్రలో ఇవి విశిష్ట స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఈ సుదీర్ఘ నాగరిక అనుబంధాన్ని పునాదిగా చేసుకుని.. స్నేహం, సహకార సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే విషయానికి కట్టుబడి ఉన్నాం" అని తెలిపింది. 'గ్రీన్ శాన్వీ' సహా ఇప్పటివరకు భారత్ జెండాతో కూడిన ఎనిమిది ఇంధన నౌకలు హర్మ్యూజ్ జలసంధిని దాటాయి. ఇంకా 15కుపైగా నౌకలు ఆ ప్రాంతంలో చిక్కుకుపోయాయి. ప్రస్తుతానికి భారత జెండా కలిగిన నౌకలను స్వదేశానికి తీసుకురావడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఓడరేవులు, నౌకా రవాణా, జలమార్గాల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఇటీవల మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.



# తీర ప్రాంత పరిరక్షణలో నౌకాదళ అసమాన సేవలు

భారత దేశంలో క్రి.పూ. 2300లో ప్రస్తుత గుజరాత్ లోని మంగ్రోల్ దగ్గర మొట్ట మొదటి నౌకాతీరం నిర్మించబడినది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యంలో మొదటిసారి నౌకా విభాగాన్ని ఏర్పరిచారు. చంద్రగుప్త మౌర్యుడి ప్రధానమంత్రి అయిన చాణక్యుడు తాను రచించిన అర్థ శాస్త్రంలో నవాధ్యక్ష పేరుతో నదీ జలాల వినియోగం గురించి నిర్దేశించాడు. బ్రిటిషు ప్రభుత్వం భారత దేశాన్ని పాలిస్తున్నప్పుడు 1830లో రాయల్ ఇండియన్ నేవిని ఏర్పరిచారు. ఇది 1946 నాటికి 78 ఓడలు, 2000 మంది సిబ్బంది కలిగి ఉండేది. 26 జనవరి 1950 న భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిన రోజున నౌకా దళానికి ఇండియన్ నేవిగా, వాహకాలకు ఇండియన్ నావల్ షిప్ గా పేరు పెట్టారు.

1961లో జరిగిన ఆపరేషన్ విజయ్ లోఇండియన్ నేవి మొట్ట మొదటి సారి యుద్ధంలో పాల్గొన్నది. 1965లో జరిగిన భారత్ - పాక్ యుద్ధంలో నేవి ఎక్కువ పాల్గొనక పోయిన తీర ప్రాంతాల పరిరక్షణలో కీలకపాత్ర వహించింది. 1971లో జరిగిన భారత్ - పాక్ యుద్ధంలో నేవి విశిష్టమైన పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో పాకిస్తాన్ దగ్గర ఉన్న అత్యంత ప్రమాదకరమైన పి ఎన్ ఎస్ ఘాజి జలాంతర్గామిని ద్వసం చేసి సముద్రంలో ముంచి వేసిన ఘనత ఐ ఎన్ ఎస్ - రాజ్ పుత్ కు దక్కుతుంది. ఐ ఎన్ ఎస్ నిర్ఘాట్, ఐ ఎన్ ఎస్ నిపత్ లు కరాచీ పోరను చుట్టిముట్టి మిగిలిన పాకిస్తాన్ పోర్టులతో రాకపోకలను, పాక్ సైన్యానికి సహాయాన్ని అడ్డుకొని భారత దేశానికి విజయాన్ని అందించడంలో ముఖ్యపాత్ర వహించాయి.

భారతదేశ నావికా దళం భారత సైనిక దళాల యొక్క సముద్ర విభాగం, భారతదేశ రాష్ట్రపతి నౌకాదళానికి సర్వ సైన్యాధ్యక్షుడు. కేవలం దేశ రక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. 2004లో దక్షిణ భారత దేశాన సునామి సంభవించి నపుడు కొద్ది గంటల్లోనే నేవి 27 నౌకలు, 19 హెలీకాప్టర్లు, 06 యుద్ధ విమానా నౌకలు, 5000 మంది సిబ్బందితో ముందుగా సహాయ చర్యలు చేపట్టింది. నేవి చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టడం ఇదే ప్రథమం.

భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్ర పరచుటలో, ఓడరేవు సందర్శనల ద్వారా, భారతదేశం అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఉమ్మడి వ్యాయా మాలు, మానవతావాద మిషన్లు, విపత్తు ఉపశమనం మొదలైనవి వారి కర్తవ్యాలు. ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. ఈ నివేదిక ప్రకారం 58,000 మంది సిబ్బంది, విమాన వాహక నౌక, పెద్ద రవాణా ఓడ, 15 యుద్ధ నౌకలు, 8 గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, 24 కొర్వెట్టెలు, 13 సంప్రదాయ జలాంతర్గాములు, 1 అణు దాడి జలాంతర్గామి, 30 పెట్రోల్ ఓడలు, వివిధ సహాయక నౌకలు మొదలైనవి భారత నావికాదళంలో భాగం. భారత నావికా దళంలో తూర్పు కమాండ్ - విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ - ముంబాయి దక్షిణ కమాండ్ - కోచి, అండమాన్ నికోబార్ నావల్ - పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి.

1985 నుండి అణు జలాంత ర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది.

1987లో భారత నౌకా దళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంత ర్గాముల నుండి టార్పీడో అను క్షిపణులను ప్రయోగిస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ - ఐ ఎన్ ఏస్ షల్కి. 8 డిసెంబర్ 1967లో భారత నౌకాదళంలో ప్రవేశపెట్ట బడిన తొలి జలాంతర్గామి - ఐఎన్ఎస్ కల్వరి.



**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**
**9440595494**

# మహోన్నత పార్లమెంటేరియన్ జగ్జీవన్ రామ్

భారత దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేత జగ్జీవన్ రామ్. అతి చిన్న వయస్సులో (27 ఏళ్లకే) శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, బాబూ జగ్జీవన్ రాం. పోలిటికల్ కింగ్ మేకర్‌గా రాజకీయంలో రాణించి, అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పనే చేసిన మహోన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం. యాభై ఏళ్ళు పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, ఛాందా గ్రామంలో శిబిరం, బసంతి దేవి దంపతులకు జగ్జీవన్ జన్మించారు. ఆయన ఒక పేద దళిత కుటుంబంలో జన్మించడంతో ఎన్నో అవమానాలను, ఛీత్కారలను ఎదుర్కొన్నారు.

చిన్ననాడే తండ్రి చనిపోవడంతో సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య తల్లి వసంతీదేవి సంరక్షణలో తన చదువు కొనసాగించారు. రాత్రింబవళ్ళు భోజ్‌పురితో పాటు హిందీ, ఇంగ్లీషు, బెంగాలి, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్, కలకత్తా విశ్వ విద్యాయం నుంచి డిస్టింక్షన్‌లో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పట్టభద్రు డయ్యారు. పీజీ చదువు పూర్తి చేశారు. కార్మికుల కోసం పోరాడి 35వేల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అనేకమంది జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు.

ఆయన జీవితకాలం 78 ఏళ్ళు అయితే అందులో 52 ఏళ్ళు రాజకీయ జీవితం గడిపారు. 1952లో భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిది సార్లు గెలిచారు. ఏకధాటిగా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన ప్రత్యేకత చాటుకున్నారు. మొదటి శ్రేణి పార్లమెంట్ రియన్‌గా నిలిచారు. మంత్రి మండలిలో అతి చిన్న వయసుడైన జగ్జీవన్‌రామ్‌ను అందరూ 'బేబి మినిస్టర్' అని పిలిచేవారు.



ప్రజలంతా ప్రేమతో 'బాబుజీ' అని పిలిచేవారు.

వ్యవసాయ శాఖ మంత్రిగా, ఆహార శాఖ మంత్రిగా, రైల్వే మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలనందించిన ప్రగతిశీలి ఆయన. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చెయ్యటంలో కీలకపాత్ర పోషించారు. 1942లో కాంగ్రెస్ లో చేరి, జగ్జీవన్ 1969లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో ఇందిరా గాంధీతో విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చి 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' పార్టీ ఏర్పాటు చేశారు.

ఇంద్రాణిదేవితో బాబుజీకి 1935 జూన్ 1న వివాహం జరిగింది. ఇంద్రాణి కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆయన కుమార్తె మీరాకుమార్ తండ్రి ఆదర్శాలతోనే పెరిగి, ఆయన బాటలోనే కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా దేశానికి సేవలందించారు. బాబుజీ గొప్ప రచయిత అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. "భారత దేశంలో కులం సవాళ్ళు", " జీవన సరళి వ్యక్తిత్వ వికాసం" అను రెండు విశిష్ట గ్రంథాలను రాశారు.

ఆయన గొప్ప అధ్యయనశీలి. ఉజ్జయినిలోని విక్రమ విశ్వ విద్యాయం 1967లో జగ్జీవన్‌రామ్‌కి 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన సేవను మెచ్చిన కాన్పూర్ విశ్వవిద్యాయం 1968లో డాక్టరేట్‌తో సత్కరించింది. జగ్జీవన్ రామ్ అమూల్యరత్నం" అని గాంధీ ఒక సందర్భంలో రాశారు. 1986 జూలై 6వ తేదీన బాబూజీ తన తుదిశ్వాస విడిచారు. బాబు జగ్జీవన్ రామ్ వరుసగా ప్రజాప్రతినిధిగా, భారత దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ మంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా 1946 నుండి 1952 సంవత్సరం వరకు ఉన్నారు. ఆయన 1952 నుండి 1956 సంవత్సరం వరకు కేంద్ర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా, రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. 1962 నుండి 1963 సంవత్సరం వరకు ఆయన కేంద్ర రవాణా మరియు సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1966 నుండి 1967 సంవత్సరం వరకు కేంద్ర కార్మిక, ఉపాధి మరియు పునరావాస శాఖ మంత్రిగా పని చేశారు. 1967 నుండి 1970 వరకు కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. 1970-1974, 1977 - 1979 కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నారు. 1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు. సెప్టెంబర్ 1976 నుండి 1983 ఏప్రిల్ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడిగా పని చేశారు. భారత ఉప ప్రధానమంత్రిగా, 1977 మార్చి 24 నుండి 1979 జూలై 28 వరకు విధులు నిర్వర్తించారు.

**-రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# వామపక్ష కోట.. ప్రజాస్వామ్య బాట

- **సరిహద్దులు దాటిన సిద్ధాంతం - సామాన్యుడికి దక్కిన అధికారం:**
- **సామాజిక విప్లవం నుండి ఆధునిక అభివృద్ధి నమూనా వరకు**
- **కేరళ రాజకీయ ప్రస్థానంపై ప్రత్యేక విశ్లేషణ**



**1957 సంవత్సరంలో భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక విశిష్ట ఘట్టం ఆవిష్కృతమైంది. స్వాతంత్ర్యం అనంతరం తొలి దశలోనే దేశ రాజకీయాల్లో ప్రధానంగా జాతీయ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఒక కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఆ చారిత్రక సంఘటన కేరళ రాష్ట్రంలో చోటుచేసుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ రాజకీయ విప్లవానికి నాయకత్వం వహించినవారు ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రపంచంలోనే తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఇదేనని చరిత్రకారులు గుర్తిస్తారు. ఇది కేవలం ఒక పార్టీ విజయం మాత్రమే కాదు, శతాబ్దాల తరబడి పేరుకుపోయిన సామాజిక అసమానతలపై సామాన్యుడు సాధించిన సంచలనాత్మక విజయం.భారతదేశ రాజకీయ పటంలో కేరళ రాష్ట్రానిది ఒక ప్రత్యేకమైన గుర్తింపు. వైవిధ్య భరితమైన భౌగోళిక పరిస్థితులు, అత్యధిక అక్షరాస్యత, విలక్షణమైన సామాజిక చైతన్యం కేరళను దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా నిలబెట్టాయి.**

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**

1950వ దశకంలో కేరళ సామాజిక చిత్రం అత్యంత క్లిష్టంగా ఉండేది. భూస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకుని ఉండటం వల్ల సామాన్య రైతాంగం తీవ్ర దోపిడీకి గురయ్యేది. కుల వివక్ష పరాకాష్టకు చేరుకుని, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలు సమాజాన్ని పీడిస్తున్న నేపథ్యంలో, అణగారిన వర్గాల్లో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఈ తరుణంలో కమ్యూనిస్టు సిద్ధాంతాలు శ్రామిక వర్గాల్లో ఆశలు రేకెత్తించాయి. ఎలమకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్ (ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్) వంటి మేధావి నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించింది. దీని ఫలితంగానే 1957లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ 126 స్థానాల్లో 60 స్థానాలను కైవసం చేసుకుని, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రపంచపు మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ఇది చరిత్ర పుటల్లోకెక్కింది.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నంబూద్రిపాద్ అద్భుతమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా భూసంస్కరణల చట్టం ద్వారా భూస్వాముల గుప్పిట్లో ఉన్న వేల ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు, భూమి లేని పేదలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులకు దారితీసింది. అదేవిధంగా, విద్యా రంగంలో ప్రైవేట్ యాజమాన్యాల గుత్తాధిపత్యాన్ని తగ్గించి, ప్రభుత్వ నియంత్రణను పెంచుతూ విద్యా సంస్కరణల బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, ఈ విప్లవాత్మక మార్పులు సమాజంలోని పెత్తందారీ వర్గాలను, మతపరమైన సంస్థలను కలవరపెట్టాయి. చర్చిలు, నాయర్ సర్వీస్ సొసైటీ వంటి సంస్థలు ఏకమై ప్రభుత్వంపై 'విమోచన సమరం' పేరుతో ఆందోళనలు చేపట్టాయి. ఈ అశాంతిని సాకుగా చూపుతూ 1959లో అప్పటి కేంద్ర ప్రభుత్వం వివాదాస్పదమైన ఆర్టికల్ 356ను ప్రయోగించి, నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది. ఇది భారత ఫెడరల్ వ్యవస్థలో ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయినప్పటికీ, ఆ ప్రభుత్వం వేసిన అభివృద్ధి పునాదులు మాత్రం చెక్కుచెదరలేదు.

1960వ దశకంలో కమ్యూనిస్టు పార్టీలో సంభవించిన చీలిక ఫలితంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆవిర్భవించింది. ఆ తర్వాతి కాలంలో కేరళ రాజకీయాలు రెండు ప్రధాన ధ్రువాల చుట్టూ తిరగడం ప్రారంభమైంది. ఒకటి సిపిఐ(ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), రెండోది కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్. ఈ రెండు కూటముల మధ్య జరిగిన పోరు కేరళ ఓటర్లలో అద్భుతమైన చైతన్యాన్ని నింపింది. 1980 నుండి 2016 వరకు కేరళ ఓటర్లు ఒక విలక్షణమైన తీర్పును ఇస్తూ వచ్చారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని మార్చడం అక్కడ ఒక అనవాయితీగా మారింది. ఒకసారి ఎల్.డి.ఎఫ్ గెలిస్తే, మరుసటి ఎన్నికల్లో యు.డి.ఎఫ్ గెలవడం ద్వారా ఏ పార్టీ కూడా అధికార మదంతో విర్రవీగకుండా ప్రజలు అదుపు చేస్తూ వచ్చారు. ఈ మార్పు కేవలం రాజకీయ మార్పు మాత్రమే కాదు, పాలనలో జవాబుదారీతనం కోరే ప్రజల ఆకాంక్షకు ప్రతీక.

ఈ సంప్రదాయాన్ని 2021 ఎన్నికలు సమూలంగా మార్చివేశాయి. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ ప్రభుత్వం, తన ఐదేళ్ల పాలనలో ఎదుర్కొన్న సవాళ్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. వరుసగా సంభవించిన ప్రళయకాల వరదలు, నిపా వైరస్ విజృంభణ, ఆపై కోవిడ్-19 మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రదర్శించిన చొరవ ప్రజల మనసు గెలుచుకుంది. ముఖ్యంగా 'కేరళ మోడల్' అభివృద్ధిలో భాగంగా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, సంక్షేమ పింఛన్లను ఇంటికే చేరవేయడం, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించడం వంటి చర్యలు పినరయి విజయన్ కు భారీ ప్రజాదరణను తెచ్చిపెట్టాయి. ఫలితంగా 2021 ఎన్నికల్లో 140 స్థానాలకు గాను 99 స్థానాలు గెలుచుకుని, నాలుగు దశాబ్దాల 'ప్రత్యామ్నాయ పాలన' రికార్డును తిరగరాస్తూ వరుసగా రెండోసారి ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ప్రస్తుత కేరళ రాజకీయాల్లో మధ్య ప్రధాన పోటీ కొనసాగుతున్నప్పటికీ, భారతీయ జనతా పార్టీ తన ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. శబరిమల వివాదం వంటి అంశాలను ఆధారం చేసుకుని హిందూ ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలని చూస్తున్నప్పటికీ, కేరళలో ఉన్న బలమైన లౌకిక వాదం మరియు సామాజిక చైతన్యం వల్ల బీజేపీ ఇప్పటికీ అక్కడ మూడవ స్థానానికే పరిమితమవుతోంది. అయితే ఆ పార్టీ ఓట్ల శాతం క్రమంగా పెరుగుతుండటం భవిష్యత్తులో త్రిముఖ పోటీకి దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి.

కేరళ సాధించిన విజయాల వెనుక 'అధికార వికేంద్రీకరణ' అతిముఖ్యమైన పాత్ర పోషించింది. 1996లో ప్రవేశపెట్టిన 'పీపుల్స్ ప్లానింగ్ క్యాంపెయిన్' ద్వారా అభివృద్ధి నిధులను నేరుగా స్థానిక సంస్థలకు (పంచాయితీలకు) బదిలీ చేయడం వల్ల గ్రామీణ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యే సంస్కృతి ఏర్పడింది. నేడు కేరళ మానవాభివృద్ధి సూచికలో నార్వే, స్వీడన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతోంది. నూటికి నూరు శాతం అక్షరాస్యత, తక్కువ శిశు మరణాల రేటు, మెరుగైన లింగ నిష్పత్తి కేరళను దేశానికే మార్గదర్శిగా నిలిపాయి.

అయితే, ఈ ప్రగతి పథంలో సవాళ్లు కూడా లేకపోలేదు. కేరళ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా విదేశీ వలసదారుల (ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుండి) ఆదాయంపై ఆధారపడి ఉంది. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా వలసలు తగ్గితే తలెత్తే ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న నిరుద్యోగిత, మరియు రాష్ట్రం ఎదుర్కొంటున్న భారీ అప్పుల భారం ఆందోళన కలిగిస్తున్నాయి. పారిశ్రామికీకరణ ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల విద్యావంతులైన యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు లేదా దేశాలకు వలస పోవాల్సి వస్తోంది. అలాగే పర్యావరణపరంగా సున్నితమైన పశ్చిమ కనుమల రక్షణ మరియు తరచూ సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు పాలనలో పెను సవాళ్లుగా మారాయి.

ముగింపుగా చెప్పాలంటే, 1957లో నంబూద్రిపాద్ వేసిన సామాజిక న్యాయ బీజం నేడు మహావృక్షమై కేరళకు రక్షణ కవచంలా నిలిచింది. కమ్యూనిస్టు భావజాలం మరియు ప్రజాస్వామ్య విలువలు సమ్మిళితమై సామాన్య మానవుడి జీవితంలో మార్పును ఎలా తీసుకురావచ్చో కేరళ నిరూపించింది. రాజకీయం అంటే కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదు, అది సామాజిక పరివర్తనకు ఒక సాధనం అని కేరళ చరిత్ర చాటి చెబుతోంది. భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక, ఉపాధి సవాళ్లను ఈ రాష్ట్రం ఎలా అధిగమిస్తుందో చూడాలి గానీ, భారత ప్రజాస్వామ్య ప్రయోగశాలలో కేరళ ఎప్పటికీ ఒక ప్రకాశవంతమైన నక్షత్రంలానే ఉంటుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించే పాలన, పౌర చైతన్యం ఉన్నంత కాలం కేరళ తన విశిష్టతను కాపాడుకుంటూనే ఉంటుంది.

# రన్ ఫర్ జీసస్

- మునుగనూరులో భారీ శాంతి ర్యాలీ
- జెండా ఊపిన ఎమ్మెల్యే మల్ రెడ్డి
- యేసుక్రీస్తు శాంతి సందేశం
- ప్రశాంతంగా ముగిసిన యాత్ర



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 04 :** గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలకు మధ్యలో వచ్చే "పరిశుద్ధ శనివారం" పురస్కరించుకొని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ మునుగనూరు (సీ సీ ఎం), స్థానిక క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నాడు "రన్ ఫర్ జీసస్" శాంతి ర్యాలీని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తొర్రూర్ – కోహెడ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చిన వందలాది మందిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. యేసు క్రీస్తు శాంతి సందేశంతో ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉందని, సమాజంలోని ప్రజలందరికీ సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

### యేసుక్రీస్తు ప్రేమ తత్వం

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెవరెండ్ డాక్టర్ చింతల ఇషాకర్ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం ప్రాణత్యాగం చేసిన యేసు క్రీస్తు చూపిన శాంతి, సహనం, ప్రేమ తత్వం ఎప్పటికీ ఆచరణ యోగ్యమేనని తెలిపారు. ఈ ర్యాలీ కోహెడ, పెద్ద అంబర్పేట్, హయత్నగర్ మీదుగా సాగి మునుగనూరుకు చేరుకుంది. తుర్కయంజాల్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు గుత్తా వెంకట్ రెడ్డి, నాయకులు మధు, నక్క సువర్ణ రాజు గౌడ్ స్వాగతం పలికి ముగించారు.

### పోలీసుల పర్యవేక్షణలో బందోబస్తు

ఈ యాత్రకు హయత్నగర్, అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రన్ ఫర్ జీసస్ కోఆర్డినేటర్, తెలంగాణ వై ఎం సీ ఏ అధ్యక్షులు టీ ఎస్ విలియమ్స్, సీ సీ ఎం చీఫ్ అడ్వైజర్ డాక్టర్ దేవరాజ్, కమిటీ సభ్యులు వై విజయ్, జే దెబోరా, కే నాగరాజు, వీ రమేష్ పాల్గొన్నారు. పాస్టర్లు గిడియోన్, క్రాంతి కుమార్, నక్క డేనియల్, పాల్, మేరీ, ప్రసన్న, దామెర జెకర్య, ఆడమ్, నాయకులు జే శాంసన్ రాయ్, సెభాస్టియన్ మేనోన్, రాక్సన్, కే నాగన్న, పీ శ్రీనివాస్, ఐ రవిపాల, ఎస్ శ్రీనివాస్ రావు, శ్యామ్ తో పాటు వందలాది క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శం కేరళ పాలన

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి
- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై సీపీఎం నేత ధ్వజం
- ఆరు గ్యారంటీల అమలుపై బహిరంగ సవాల్
- విజయన్ అనుభవం అంత రేవంత్ వయసు లేదని ఎద్దేవా

**ఎల్బీనగర్, ఏప్రిల్ 4 :** వామపక్ష ప్రభుత్వం ఏలుతున్న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురించి తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం సరికాదని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు విమర్శించారు. శుక్రవారం మన్సూరాబాద్ సహారా ఎస్టేట్స్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. కేరళ పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన కేరళ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు రేవంత్ రెడ్డి నోరు అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు.



### ఆరు గ్యారంటీలపై బహిరంగ సవాల్

కేరళ అఖిలపక్షాన్ని తెలంగాణకు తీసుకువచ్చి ఇక్కడ ఆరు గ్యారంటీల అమలు తీరుపై మాట్లాడే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా అని సీతారాములు సవాల్ విసిరారు. కేరళ ప్రభుత్వం విద్యా, వైద్య, ఆరోగ్య, సంక్షేమ రంగాలతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థలో దేశానికే రోల్ మోడల్ గా ఉందని తెలిపారు. కరోనా క్లిష్ట సమయంలో ప్రజలకు ఆ ప్రభుత్వం అండగా ఉండటం వల్లే రెండోసారి వామపక్షాలు అక్కడ అధికారంలోకి వచ్చాయని గుర్తు చేశారు. గతంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేరళను సందర్శించి అక్కడి వైద్య విధానాన్ని అధ్యయనం చేశాకే తెలంగాణలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి విజయన్ అనుభవం అంత వయసు కూడా రేవంత్ రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు.

### నిర్వీర్యమవుతున్న వృత్తి సంఘాలు

ఎన్నికల హామీలైన మహిళలకు 2500 రూపాయలు, వ్యవసాయ కూలీలకు 1200 రూపాయలు, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటివి నేటికీ అమలు కాలేదని సీతారాములు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పాలనలో వృత్తి సంఘాలు నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే కొత్త వాగ్దానాలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగులను తొలగిస్తూ, మంత్రులు కేవలం తమ నియోజకవర్గాలకే నిధులు పరిమితం చేసుకుంటున్నారని ఆరోపించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలే అసెంబ్లీలో నిధుల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

# మత తత్వం నుంచి విముక్తే లక్ష్యం

- సమ సమాజ స్థాపన కోసం సీపీఐ రాజీలేని పోరాటం
- కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలి
- నిరుపేదల భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం
- సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, సరూర్ నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ

**ఎల్ బీ నగర్, ఏప్రిల్ 04 (మనసులో మాట):** భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ భగత్ సింగ్ నగర్ ఫేస్ టూ శాఖ కార్యదర్శి ఉషా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి కార్యక్రమానికి సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, సరూర్ నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏప్రిల్ 1 నుంచి 10 వరకు సాగే ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన నివాసాల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని మత తత్వం, కార్పొరేట్ల కోరల నుంచి విముక్తి చేసి సమ సమాజాన్ని స్థాపించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

### ఘనమైన పోరాట చరిత్ర

భారత గడ్డపై వంద ఏళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సీపీఐ అని నర్సింహ గుర్తు చేశారు. భగత్ సింగ్ నగర్ లో అజీజ్ పాషా నాయకత్వంలో అనేక పోరాటాలు చేసి గుడిసెలు వేసి నిరుపేదలకు పట్టాలు ఇప్పించిన చరిత్ర ఈ పార్టీకి ఉంది. కార్మిక, రైతు, మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ద్వారా వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేస్తోంది. నిరంకుశ నిజాంను కూలదోయడానికి జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది ప్రాణత్యాగంతో 3,000 గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత సీపీఐ కే




దక్కుతుందన్నారు.

### కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిప్పులు

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని నర్సింహ మండిపడ్డారు. రైతుల హక్కులను కాలరాసేలా మూడు వ్యవసాయ చట్టాలు, కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చారని విమర్శించారు. విద్యా ప్రైవేటీకరణ, ఉపాధి హామీ చట్టంలో మార్పులతో పాటు ఎల్ఐసీ, బ్యాంకులు, టెలికాం, రక్షణ రంగం వంటి ప్రభుత్వ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తూ కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేయడం శోచనీయమన్నారు.

### ఆగని భూ పోరాటాలు

రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్ మెట్, చేవెళ్ల ప్రాంతాల్లో భూ పోరాటాలు కొనసాగుతున్నాయని నర్సింహ తెలిపారు. గతంలో రాజేంద్రనగర్, కొందుర్గ్ మండలాల్లో ఇళ్ల స్థలాలను సాధించామని గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నంలో భూ పోరాటాలను అణచివేయాలని చూసినా వెనకడుగు వేయలేదని స్పష్టం చేశారు. మహేశ్వరం, శంకర్ పల్లిలో హక్కు పత్రాలు ఇచ్చినా ప్లాట్లు కేటాయించలేదని, దీనిపై ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేదని విమర్శించారు. బాధితుల కోసం భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు.

### పార్టీకి మద్దతు ఇవ్వండి

దేశంలో ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులు బలపడాల్సిన అవసరం ఉందని, అందుకోసం ప్రజలు సహకరించాలని నర్సింహ కోరారు. వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు ఉదారంగా విరాళాలు ఇచ్చి పోరాట పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఎండీ ఫైమీద, ప్రవీణ్ కుమార్ గౌడ్, ఎండీ మహబూబ్, సక్రు నాయక్, కమలమ్మ, ఎండీ ఇస్మాయిల్, ఇస్తారు, విజయ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

# బడుగులకు వరం సీఎం సహాయనిధి

**మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో లబ్ధి**

**30 మంది లబ్ధిదారులకు రూ. 9.97 లక్షల చెక్కుల పంపిణీ**

**చండూరులో ఆపదలో ఉన్న పేదలకు ఆర్థిక భరోసా**

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పిలుపు**



**యాదాద్రి భువనగిరి జిల్లా, ఏప్రిల్ 4 :** చండూరు మున్సిపాలిటీ గెస్ట్ హౌస్ వద్ద మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 30 మంది లబ్ధిదారులకు రూ. 9,97,000 విలువైన చెక్కులను చండూరు మున్సిపల్ చైర్మన్ అనంత చంద్రశేఖర్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న బడుగు బలహీన వర్గాలకు సీఎం సహాయనిధి ఒక వరమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ దోతీ సుజాత వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కల్మికొండ జనార్ధన్, నల్లగంటి మల్లేశం, కారింగు రామ్మూర్తి, కొంపల్లి వెంకటేశం, దోతీ చంద్రశేఖర్, అహ్మద్ జెన్నీ పాల్గొన్నారు. పేద ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తోందని, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో అనేకమందికి ఈ సాయం అందుతోందని వారు తెలిపారు.

### లబ్ధిదారుల వివరాలు

చెక్కులు అందుకున్న వారిలో చండూరుకు చెందిన దోమల దానయ్య (రూ. 5,000), రావిరాల స్రవంతి (రూ. 22,000), దోమల దానయ్య (రూ. 60,000), కర్నాటి వెంకన్న (రూ. 44,000), షేక్ ఫాతిమా బీ (రూ. 16,000), మొగుడల చిన్న లక్ష్మయ్య (రూ. 12,000), బొమ్మకంటి వెంకటేశ్వర్లు (రూ. 60,000), తాడిశెట్టి రాజేశ్వరి (రూ. 45,000), ముదిగొండ సాయి (రూ. 54,000), దోతీ సాలమ్మ (రూ. 26,000), చెనగని ఇందిరమ్మ (రూ. 20,000), పంపటి శ్రీనివాసులు (రూ. 50,000), కనెగోని మల్లేష్ (రూ. 12,000), కల్లెట్ల కలమ్మ (రూ. 50,000), చిలుకూరి వెంకటేశం (రూ. 60,000), వనం మధుసూదన్ (రూ. 60,000), కొలుగురి మంగమ్మ (రూ. 11,500) ఉన్నారు. అంగడిపేట గ్రామానికి చెందిన పెదబోయిన పార్వతమ్మ (రూ. 32,000), గంజి వెంకటేశం (రూ. 31,500), మరగొని ఆండాళ్ (రూ. 24,000), పెదబోయిన శంకర్ (రూ. 23,000), గజం శ్రీనివాసులు (రూ. 12,000), ఆర్పుల యాదయ్య (రూ. 12,000), చింతకుంట్ల బుషమ్మ (రూ. 19,000), బైపాంగి మమత (రూ. 6,000), సామ సైది రెడ్డి (రూ. 60,000), సామ సత్యనారాయణ (రూ. 60,000), చిలుకూరి సుధాకర్ రెడ్డి (రూ. 27,000), నాతీ సత్తయ్య (రూ. 23,000), వినయ్ ప్రభాకర్ (రూ. 60,000) చెక్కులను అందుకున్నారు.

# గ్రామీణ క్రీడాకారుల కోసమే 'సంసద్ ఖేల్ మహోత్సవ్'

**ఎంపీ డీకే అరుణ**

**ఏప్రిల్ 9 నుంచి 24 వరకు క్రీడల పండుగ**

**నారాయణపేటలో ప్రారంభం.. ముగింపునకు గవర్నర్ హాజరు**

**కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, క్రికెట్ పోటీలు**

**ఏప్రిల్ 6 లోపు జట్లు నమోదు చేసుకోవాలి**



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 04**

మహబూబ్‌నగర్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా 'ప్రధాన్ మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్' నిర్వహిస్తున్నట్లు ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఈ పోటీల ద్వారా క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని ఐడీఓసీ కలెక్టర్ సమావేశ మందిరంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### పోటీల షెడ్యూల్ వివరాలు

ఈ క్రీడా మహోత్సవం ఏప్రిల్ 9న నారాయణపేటలో ఘనంగా ప్రారంభం కానుంది. గ్రామ స్థాయి జట్లు ఏప్రిల్ 6వ తేదీలోపు ఆఫ్ లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీ సూచించారు.

**ఏప్రిల్ 9 నుంచి 15 వరకు: మండల స్థాయి పోటీలు**
**ఏప్రిల్ 15 నుంచి 20 వరకు: అసెంబ్లీ స్థాయి పోటీలు**
**ఏప్రిల్ 21, 22 తేదీల్లో: పార్లమెంటరీ స్థాయి పోటీలు**
**ఏప్రిల్ 23న: పరుగు పందాలు**
**ఏప్రిల్ 24న: బహుమతుల ప్రదానోత్సవంతో పాటు ముగింపు వేడుక (తెలంగాణ గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు).**

### నాలుగు ప్రధాన క్రీడలు

ఈ మహోత్సవంలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, క్రికెట్ అనే నాలుగు ప్రధాన క్రీడలను ఎంపిక చేసినట్లు డీకే అరుణ వివరించారు. ప్రతి మండలంలో ప్రతి క్రీడకు ఒక కోఆర్డినేటర్ చొప్పున నలుగురిని నియమించి పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. క్రీడా వేదికల వద్ద మైదానాల మార్కింగ్, నీడ కోసం టెంట్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. గాయాల నివారణకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని, పోలీసు భద్రత కల్పించాలని సూచించారు. యువత శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని ఎంపీ పేర్కొన్నారు. డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచడంలో, మొబైల్ ఫోన్ల వ్యసనం నుంచి బయటపడటంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

# గోదావరిఖనిలో ఘోర ప్రమాదం ఒకరి మృతి

**అతివేగంతో వచ్చి కరెంటు స్తంభాన్ని ఢీకొన్న కారు**

**ముగ్గురు సింగరేణి కార్మికులకు తీవ్ర గాయాలు**

**రాజేశ్ థియేటర్ వద్ద తెల్లవారుజామున ఘటన**




**పెద్దపల్లి, ఏప్రిల్ 04 :** గోదావరిఖనిలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సింగరేణి కార్మికులు ప్రయాణిస్తున్న కారు అతివేగంతో వచ్చి రాజేశ్ థియేటర్ వద్ద ఉన్న కరెంటు స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో ప్రయాణికులంతా లోపలే ఇరుక్కుపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి కారులో ఇరుక్కున్న వారిని అతికష్టం మీద బయటకు తీశారు. గాయపడిన వారిని అంబులెన్సుల్లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ఘోరం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

# పాత కక్షలతో ఘాతుకం.. టిప్పర్ తో ఢీకొట్టి హత్య!

**వెల్దండలో భూ వివాదం నేపథ్యంలో దారుణం**

**ప్రమాదంగా నమ్మించేందుకు నిందితుల కుట్ర**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 04 :** పాత కక్షలు ఒక వ్యక్తి ప్రాణం తీశాయి. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తిని ప్రత్యర్థులు టిప్పర్ తో ఢీకొట్టి హతమార్చారు. ఈ దారుణ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. భూ వివాదాల విషయంలో మహేష్ కు ప్రత్యర్థులకు మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహేష్ కారులో ప్రయాణిస్తుండగా ప్రత్యర్థులు టిప్పర్ తో బలంగా ఢీకొట్టారు. అతడిని హతమార్చిన అనంతరం ఈ ఘటనను కేవలం ఒక రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితులు ప్రయత్నించారు. భూ తగాదాలకు సంబంధించి తమకు అడ్డు వస్తున్నాడనే కారణంతోనే మహేష్ పై దాడి చేసి చంపారని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. భూ వివాదమే ఈ హత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

# ట్రాన్స్‌జెండర్ల సాధికారతకు తెలంగాణ బాట

## నైపుణ్య శిక్షణ ప్రారంభం!

**స్వయం ఉపాధితో ఆత్మగౌరవ జీవనం అందించడమే లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**డ్రైవింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రోన్ పైలట్ కోర్సుల్లో శిక్షణ**

**91 మంది లబ్ధిదారుల కోసం రూ. 17.72 లక్షల కేటాయింపు**

**మారుతీ డ్రైవింగ్ స్కూల్, ఏవియేషన్ అకాడమీ సహకారంతో కార్యక్రమం**




**హైదరాబాద్, ఏప్రిల్ 04 :** ట్రాన్స్‌జెండర్ల సామాజిక, ఆర్థిక సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ లో ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ట్రాన్స్‌జెండర్లకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికే ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద నియంత్రణకు, మెట్రోలో సెక్యూరిటీ గార్డులుగా వారిని నియమించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు స్వయం ఉపాధికి దోహదపడేలా కార్ డ్రైవింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రోన్ పైలట్ వంటి మూడు ముఖ్య రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మారుతీ డ్రైవింగ్ స్కూల్ సహకారంతో డ్రైవింగ్ పాఠాలు నేర్పించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత కాలంలో డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యం పెరుగుతోందని మంత్రి వివరించారు. ఫోటోలు, వీడియోల చిత్రీకరణతో పాటు వ్యవసాయంలో మందుల పిచికారీ, వివాహ వేడుకలు, ఇతర కార్యక్రమాల్లో వీటి వినియోగం పెరిగిందన్నారు. ఈ శిక్షణతో ట్రాన్స్‌జెండర్లు భవిష్యత్ టెక్నాలజీ రంగంలో రాణించే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మొత్తం కార్యక్రమం కోసం రూ. 17.72 లక్షలు ఖర్చు చేస్తున్నామని, 91 మంది లబ్ధి పొందనున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం కేవలం సహాయం చేయడం మాత్రమే కాకుండా కొత్త అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి స్పష్టం చేశారు. వాగ్దానాలు కాకుండా అమలు ద్వారా నమ్మకం కల్పిస్తామని చెప్పారు. ట్రాన్స్‌జెండర్లను కేవలం ఓటర్లుగా కాకుండా సమాజంలో భాగస్వాములుగా గుర్తిస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయం, ఆర్థిక బలం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ శిక్షణను ఒక గొప్ప అవకాశంగా మలచుకుని ఆత్మగౌరవంతో జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజ, ఎన్ ఐ టీ హెచ్ ఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకట రమణ, ఏవియేషన్ అకాడమీ సీ ఈ ఓ కెప్టెన్ ఎస్. ఎన్. రెడ్డి, శేరిలింగంపల్లి డీ సీ పీ శ్రీనివాస్ ఐ పీ ఎస్ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అండగా నిలవాలి

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి
- మానవ సేవే మాధవ సేవగా కృషి చేయాలి
- వైభవంగా మేధో దివ్యాంగుల పాఠశాల 36వ వార్షికోత్సవం
- పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం
- సీఎం రేవంత్ రెడ్డిని పాఠశాలకు ఆహ్వానిస్తాం
- స్వయం ఉపాధితో రాణిస్తున్న విద్యార్థులు



**కరీంనగర్, ఏప్రిల్ 04 :**

మానవ సేవే మాధవ సేవ అని, మానసిక శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులకు సేవ చేయడం వల్ల గొప్ప ఆత్మ సంతృప్తి కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్ ఎండీ కాలనీ మహాత్మా నగర్ లోని స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేధో దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల 36వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

### సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

జన్యు లోపాలతో మేధోపరమైన వెనుకబాటుతనం ఉన్న పిల్లల కోసం స్వాతంత్ర్య సమరయోధులు ముందుచూపుతో ఈ పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కేవీ నర్సింగరావు కృషితో వెలసిన ఈ పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాలకు ఒక దేవాలయం వంటిదని కొనియాడారు. మానసిక వైకల్యం ఉన్న పిల్లలను కన్నబిడ్డల్లా చూసుకుంటున్న టీచర్లు, ఆయాలు, సిబ్బందిని దేవుళ్లుగా ఆయన అభివర్ణించారు. చాడ వెంకట్ రెడ్డి తనకున్న పరిచయాలతో ఈ సంస్థను మరింత అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 50 లక్షలు కేటాయించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ పాఠశాల సమస్యలను తీసుకెళ్లి ఆయన ఇక్కడికి వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్వయం ఉపాధితో రోజుకు రూ. 500 సంపాదిస్తున్న విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

### అభివృద్ధి పథంలో పాఠశాల

ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. 1990లో 20 మందితో ప్రారంభమైన ఈ పాఠశాల నేడు 127 మందికి ఆశ్రయం కల్పిస్తోందని తెలిపారు. ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి రెండు ఎకరాల భూమి కేటాయించామని, తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 25 లక్షలతో భవనాలు నిర్మించామని గుర్తు చేశారు. ఐఏఎస్ అధికారిణి అనిత రామచంద్రన్ చొరవతో రూ. 26 లక్షల విలువైన బస్సు లభించిందని వివరించారు. నాపో్కో సీఈఓ రాజు, ఎల్ వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వంటి దాతల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్ కూడా పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు.

### స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి

18 ఏళ్లు దాటిన విద్యార్థుల కోసం కొవ్వొత్తులు, విస్తరాకులు, సబ్బుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు వెంకట్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల స్థితిగతులను బట్టి స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, యోగా వంటి నైపుణ్యాలను నేర్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో 77 మంది వసతిగృహంలో ఉండగా, 50 మంది డేస్కాలర్ విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సదానందం గౌడ్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఇలాంటి పాఠశాల ఒకటి ఉండాలని కోరారు. ఆర్డీవో మహేశ్వర్ సిబ్బంది కృషిని అభినందించారు. చీఫ్ ఇంజనీర్ సుమతి దేవి ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం అందజేస్తానని ప్రకటించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్, సీనియర్ జర్నలిస్టులు మధుసూదన్ రెడ్డి, శేఖర్, ట్రస్ట్ సభ్యులు వెంకటయ్య, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా జరగాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై సీఈఓ సమీక్ష
- బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశం
- పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించాలి
- రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచన
- ఎక్కడా బీ ఎల్ ఓ పోస్టులు ఖాళీగా ఉండకూడదని స్పష్టీకరణ




**నారాయణపేట, ఏప్రిల్ 04 :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, ఏజెంట్ల నియామకం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### మ్యాపింగ్ లో వేగం పెంచాలి

ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీ ఎల్ ఓ లు) ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి.. బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా చూడాలన్నారు. బీ ఎల్ ఓ లకు అవసరమైన శిక్షణతో పాటు వారికి కావాల్సిన మెటీరియల్ ను కూడా సకాలంలో అందజేయాలని ఆదేశించారు.

### ఖాళీలు ఉండకూడదు.. దరఖాస్తులు పెండింగ్ పెట్టొద్దు

ఎక్కడా బీ ఎల్ ఓ పోస్టులు ఖాళీగా ఉండకూడదని.. ఒకవేళ ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులను నియమించాలని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన ఫారం 6, 7, 8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయి యంత్రాంగం అత్యంత కీలకంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ శ్రీను, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 6 నుంచి ఆరోగ్య వారోత్సవాలు

- వారం రోజుల పాటు భారీ కార్యక్రమాలు!
- ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహనే లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ
- 871 మంది డాక్టర్లకు నియామక పత్రాల అందజేత
- నిమ్స్ లో లీనాక్ సేవలు.. క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రారంభం
- ఆరు రోజుల పాటు రోజుకో ప్రత్యేక థీమ్ తో వేడుకలు

**హైదరాబాద్, ఏప్రిల్ 04 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'హెల్త్ వీక్' (ఆరోగ్య వారోత్సవాలు) నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ఈ వేడుకలు ఉండాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఒక ప్రత్యేక అంశంపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 6న 'ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే' సందర్భంగా ఉదయం నెక్లెస్ రోడ్ లో 'ఈట్ రైట్ వాక్', మధ్యాహ్నం నేచరోపతి ఆస్పత్రిలో మిల్లెట్ మేళా ఏర్పాటు చేస్తారు. ఆహార నిపుణులకు శిక్షణతో పాటు వీధి వ్యాపారులకు సర్టిఫికేట్ల పంపిణీ చేపడతారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం వేళ నిమ్స్ లో అత్యాధునిక 'లీనాక్' యంత్రాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అదే రోజు రవీంద్రభారతిలో తెలంగాణ క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్రామా కేర్ పాలసీని అందుబాటులోకి తెస్తూ.. కొత్తగా ఎంపికైన 871 మంది డాక్టర్లకు నియామక పత్రాలు అందజేస్తారు. ఏప్రిల్ 8న 'సేఫ్ మదర్ డే' నిర్వహిస్తూ గర్భిణులకు ఏఎన్ సీ పరీక్షలు, ప్రసూతి సేవలపై గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన కల్పిస్తారు. ఏప్రిల్ 9న ఎయిడ్స్ పై అవగాహన కోసం హైదరాబాద్ లో 'రెడ్ రన్', జైళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఉంటాయి. ఏప్రిల్ 10న 'హోమియోపతి, ఆయుష్ డే' సందర్భంగా ఉదయం యోగా ప్రదర్శనలు, హోమియోపతి కళాశాలలో రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహిస్తారు.



వారోత్సవాల ముగింపు రోజైన ఏప్రిల్ 11న 'డ్రగ్ కంట్రోల్ డే' పాటిస్తూ మందుల సురక్షిత వాడకంపై అవగాహన, గాంధీ ఆస్పత్రిలో డీ అడిక్షన్ క్యాంప్ ఏర్పాటు చేస్తారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు కూడా నిర్వహిస్తారు. రాష్ట్ర ఆరోగ్య రంగ అభివృద్ధికి ఈ కార్యక్రమాలు దోహదపడాలని మంత్రి సూచించారు. విద్యార్థులు, మహిళలు, యువతను ఈ వారోత్సవాల్లో పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో హెల్త్ వీక్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బెంచీల వితరణ



**రామారెడ్డి:** రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామంలో ఉన్నటువంటి డి న్ టీ పి స్ గోకుల్ తండా పాఠశాల కి సర్పంచ్ మోహన్ నాయక్ 15 బెంచ్ లను సుమారు 60 వేల రూపాయల విలువైన బెంచ్ లను విద్యార్థిని విద్యార్థులకు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ ఖదీర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జ్యోతి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రాజేష్ , పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# అలరించిన 'అక్షర' వార్షికోత్సవం

- ఫొటోలు 1,2,3. డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు
- 4. మాట్లాడుతున్న ట్రస్మా రాష్ట్ర సలహాదారు యాదగిరి శేఖర్ రావు




**కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండి గోపాల్ రావుపేట అక్షర హైస్కూల్ ఫినెస్టా పేరిట శనివారం నిర్వహించిన 16వ వార్షికోత్సవ వేడుకలు అందరినీ అలరించాయి. స్కూల్ చైర్మన్ మినుకుల మునీందర్, డైరెక్టర్ రాధ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపన్యాసం, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర సలహాదారు యాదగిరి శేఖర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న మునీందర్ దంపతులను అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ మహిళా అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్నారెడ్డి, ఉప సర్పంచ్ నరేష్, టీచర్స్, పేరెంట్ పాల్గొన్నారు.

## యువకుడిని కరిచిన పాము



**శంకరపట్నం:** శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామానికి చెందిన నేదురు రాకేష్ (25)ను పాము కరిచింది. వరిగడ్డి కట్ట తీస్తుండగా కట్ట కింద ఉన్న పామును గమనించకపోవడంతో ఒక్కసారిగా ఎడమ కాలి పాదంపై రెండుసార్లు కాటు వేసింది. రాకేష్ కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి, పైలట్ ఎం గోపికృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందిస్తూ అంబులెన్స్‌లో హుజురాబాద్ ఏరియా, ఆసుపత్రికి తరలించారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు




**శంకరపట్నం:** శంకరపట్నం మండల పరిధిలోని గొల్లపల్లి, కొత్తగట్టు గ్రామాల్లో 440 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువుల ఆరోగ్య రక్షణ కోసం ఈ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మాదారపు విద్యాసాగర్ రావు, మాడ సుజాత రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బాగోతుల కుమార్, మత్స్యగిరింద్ర దేవస్థానం చైర్మన్ కోరెం రాజిరెడ్డి పాల్గొన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది డాక్టర్ మాధవరావు, సందీప్ కుమార్, అమీర్ ఖాన్, అజహర్, గోపాలమిత్రలు శ్రీనివాస్, మొండయ్య, కుమారస్వామి, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నియామకం



**శంకరపట్నం:** యాదవ చైతన్య వేదిక కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేస్ అనిల్ యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల ఐలేష్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో యాదవులు, బీసీల సామాజిక–రాజకీయ చైతన్యం కోసం చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రేస్ అనిల్ యాదవ్ మాట్లాడుతూ తనను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. యాదవులు, బీసీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, బీసీలను సంఘటితం చేసి రిజర్వేషన్ సాధన కోసం ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గొర్ల కొమురయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.






# డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం హామీ

**బస్తీలు, కాలనీలలో పర్యటించి డ్రైనేజ్ సమస్యలను స్థానికులతో పరిశీలించారు. సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్**

**మాదాపూర్:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గుట్టల బేగంపేటలో శనివారం వాటర్ వర్క్స్ అధికారులు, స్థానికులతో సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలు, కాలనీల్లో పర్యటించి డ్రైనేజీ సమస్యలు ఉన్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించి, ఉన్న ఇబ్బందులను తెలుసుకుని వాటిని శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలం దృష్ట్యా మురుగునీరు నిలిచిపోకుండా కాల్వల పూడిక పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనుల నాణ్యతలో రాజీ పడకుండా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. అధికారుల సమన్వయంతో బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జీఎం హరి శంకర్, డీజీఎం నరేందర్, నాయుడు, షాలీం, సూపర్వైజర్లు, బస్తీ వాసులు హరి, ఈశ్వర్, రాజు ముదిరాజ్, శ్రీను, యాదయ్య, కృష్ణ, అశోక్, నాగేష్, లక్ష్మణ్, సూర్య కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక వసతులతో ఫంక్షన్ హాల్ ప్రారంభం



**సూర్యాపేట:** హైదరాబాద్ తరహాలో అత్యాధునిక వసతులతో, సకల సౌకర్యాలతో సూర్యాపేట లో ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ మంత్రి,సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, ఏఐసీసీ మాజీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 11వ వార్డు పిల్లలమర్రి స్టేజి సమీపంలో రుద్రంగి ఏసీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ప్రారంభించి మాట్లాడారు.జిల్లా కేంద్రం ఏర్పాటు తర్వాత సూర్యాపేట ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. నిర్వాహకులు రుద్రంగి సురేష్ మంజుల మాట్లాడుతూ పార్కింగ్, లైటింగ్, కాంపౌండ్ వాల్, అత్యాధునిక సౌకర్యాలతో అన్ని వసతులు కల్పించామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా స్వర్ణగిరి అర్చకులతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం ను ఎంతో వైభవంగా నిర్వహించారు. భక్తులు,ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణము తిలకించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్,మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ మాజీ మున్సిపల్ చైర్పర్సన్ జుట్టుకొండ సత్యానారాయణ, మాజీ కౌన్సిలర్ చల్లమల్ల నర్సింహ,రమేష్, నిమ్మల శ్రీను,ఉప్పల ఆనంద్, ఎల్గూరి ఇందిర వీరయ్య గౌడ్, గునగంటి హేమసతీష్, అబీద్, కక్కిరేణి శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.




# యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగ పరుచుకోవాలి

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**మొయినాబాద్:** యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం పరుచుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ అజీజ్ నగర్ లో కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్లేస్మెంట్ సక్సెస్ మీట్ కార్యక్రమంలో చేవెళ్ల శాసనస భ్యులు కాలే యాదయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం యువత అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నదని, అందులో భాగంగా ఇలాంటి సక్సెస్ మీట్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, యూనివర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు..

# సుజాత స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

**ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్**



**మొయినాబాద్:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోనీ సుజాత ఇంటర్నేషనల్ స్కూల్ అధిక ఫీజులతో పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మండిపడ్డారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజులను అధికంగా పెంచడాన్ని నిరసిస్తూ... విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. వారి ధర్నాకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ధర్నాలో పాల్గొన్నది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యా సంస్థ అయిన సుజాత స్కూల్ దాదాపు 33 శాతం ఫీజులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి వసూలు చేయాలని చూడడం దుర్మార్గమైన చర్య అని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల వద్ద ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని అని అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సుజాత ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ కు, డీఈఓ గారికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మండల ఎంఈఓ వెంటనే సుజాత స్కూల్ లో ఫీజులను ఎంక్వయిరీ చేసి, పాఠశాల యాజమాన్యానికి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ముందు నిరవధికంగా ఆందోళన పోరాట నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, తల్లిదండ్రులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రామ్ సేన.. తో .. మేము సైతం... అంటున్న కెపిహె హెచ్ బి కాలనీ ముస్లిం మైనారిటీ




**1000, మందికి చల్లటి మజ్జిగ మంచినీరు పంపిణీ చేసిన.. సూర్య ఉదయం భాషా...షేక్ సత్తార్...**

**కూకట్ పల్లి:** కే పి హెచ్ బి కాలనీ లో హనుమాన్ జయంతి సందర్భంగా రామసేన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ లో నిర్వహించిన హనుమాన్ విరాట్ శోభాయాత్ర 2026 లో బాగంగా రామ్ సేన తో మేము సైతం అంటూ కూకట్ పల్లి కెపిహెచ్ బి ముస్లిం మైనారిటీ సభ్యులు శోభాయాత్రలో పాల్గొనడం జరిగినది. ఈ శోభయాత్ర కు విచ్చేసిన భక్తులకు సుమారు 1000 మందికి పైగా వాటర్ బాటిల్స్, చల్లటి మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. కుల మతాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్, నూర్ భాషా దూదేకుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు భాషా, టీడీపీ సీనియర్ నాయకులు షేక్ సత్తార్ ను, ఈ కార్యక్రమంలో పాల్గొన్న విలేకరులను డిసిపి రితీరాజ్, కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి ఇంచార్జి బండి రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రామ సేన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభ యాత్రలో పాల్గొన్న భక్తులకు వాటర్ బాటిల్స్ మరియు మజ్జిగ అందించడమే కాక ప్రతి ఒక్క హిందు సోదరుని ఆప్యాయతంగా పలకరించి అలాయ్ బలాయ్ కలవడం జరిగినది, భాషా ,షేక్ సత్తార్ మాట్లాడుతూ ఆసియా లోనే అతిపెద్ద కాలనీ గా పేరుపొందిన కె పి హెచ్ బి కాలనీ లో కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలను కలిసి జరుపుకుంటామని తెలియజేశారు. ఈ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హనుమాన్ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సింగర్ నల్గొండ గద్దర్ నరసన్న, స్థానికులు మహబూబ్ (కచ్చిన్), సీనియర్ విలేకరులు కరీం భాయ్, నజీర్ భాయ్ ,గంగన్న , చంద్ర, రాము, రెహ్మాన్, ప్రవీణ్, షబ్బీర్, శివ ,శ్యాం సుందర్, క్రాంతి కుమార్, బాల కృష్ణ, సునీల్ , మహమ్మద్ హుస్సేన్ , చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# రీల్స్‌లో చిక్కుకున్న రియల్ పేరెంటింగ్!

బిడ్డ ఏడ్చినా, అన్నం తినకపోయినా.. అమ్మకు ఫోన్ చేయకుండా, పేరెంటింగ్ పుస్తకం తెరవకుండా ఇన్‌స్టాగ్రామ్‌చూస్తున్నారా? చాలామంది తల్లులు తమకు తెలియకుండానే 'ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్' అనే ప్రమాదంలో చిక్కుకున్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులు వాళ్ల బిడ్డల పోషణ కోసం ఇంట్లో పెద్దల సలహాలు పాటించేవారు. కొన్ని సందర్భాల్లో వైద్యులను సంప్రదించేవారు. కానీ, ఇప్పుడు ఇన్‌స్టా ఇన్‌ఫ్లూయెన్సర్ల రీల్స్‌నే పేరెంటింగ్ పాఠాలుగా భావిస్తున్నారు.

'పేరెంటింగ్ ఇప్పుడు ప్రైవేట్ వ్యవహారం కాదు. ఓ ప్రదర్శనలా మారిందం'టున్నారు సైకాలజిస్ట్‌లు. ఎవరో ఆటవిడుపుగా చేసే రీల్స్ ఫాలో అవుతూ.. చాలామంది పేరెంట్స్ పిల్లల పెంపకాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. తరాలుగా వస్తున్న పేరెంటింగ్ సూత్రాలు కాదని, ఏ విధమైన ధ్రువీకరణలు లేని విధానాలను అవలంబిస్తూ పసివారితో ప్రయోగాలకు పాల్పడుతున్నారు.



## అబద్ధాల ప్రపంచం

ఇన్‌స్టాగ్రామ్‌లో రంగుల ప్యాన్‌కేక్‌లు, చక్కెర లేని డెజర్ట్‌లు ఉన్న హై ఎండ్ ఫుడ్ ప్లేట్‌లను చూపిస్తున్నారు. పేరెంట్స్ వాటికి ఆకర్షితులు అవుతున్నారు. అవి ఆరోగ్యంగా కనిపించడమే కాదు.. అవే హెల్తీ అని నమ్ముతున్నారు. దీంతో తమ పిల్లలకు సాధారణంగా పప్పు.. అన్నం.. రసం లాంటివి ఫీడ్ చేసే తల్లిదండ్రులు గిల్టీగా ఫీల్ అవుతున్నారట. అలాంటి హై ఎండ్ చిరుతిళ్లు పెట్టలేకపోతున్నామే అని పోల్చుకుంటూ ఒత్తిడికి లోనవుతున్నారట.

## అసలు నిజం

శిశుపోషణ కత్తి మీద సాములా ఉంటుంది. ఇక ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉంటే తల్లిదండ్రులు నిత్యం అష్టావధానం చేయాల్సిందే! కానీ, ఇన్‌స్టా పేరెంటింగ్ దీనికి పూర్తి విరుద్ధం. ఇక్కడి ఇన్‌ఫ్లూయెన్సర్లు పర్ఫెక్షన్‌ను మాత్రమే చూపిస్తుంటారు. ఇది నార్మల్ పేరెంట్స్‌లో పోటీని సృష్టిస్తున్నది. తమ పిల్లల్నీ అలాగే చూసుకోవాలని తాపత్రయపడేలా చేస్తున్నది.

## ఎక్స్‌పర్ట్‌కామెంట్

సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ జనరలైజ్డ్ స్టేట్‌మెంట్స్‌గా ఉంటుంది. ఈ సూచనలు.. ఇంట్లో పెద్దలు, వ్యక్తిగత వైద్యుల సలహాలకు ప్రత్యామ్నాయంగా భావించొద్దు.

## కనెక్టివిటీ కట్

ప్రతి తల్లికీ తన బిడ్డతో సహజసిద్ధమైన కనెక్టివిటీ ఉంటుంది. దాన్ని కాదని ఇన్‌స్టా టిప్స్ విపరీతంగా పాటిస్తూ ప్రకృతి ధర్మంగా బిడ్డతో ఉండే బంధాన్ని చాలామంది తల్లులు కోల్పోతున్నారు. అంటే, ప్రతిదానికీ సోషల్ మీడియా చూస్తూ, సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఇది తల్లీబిడ్డల బంధానికి అత్యంత ప్రమాదకరం.

ఒత్తిడి: నిరంతరం పర్‌ఫెక్ట్‌గా ఉండాలనే తపనతో.. చాలామంది సహజత్వానికి దూరమవుతున్నారు. దీంతో ఒత్తిడికి గురవుతున్నారు.

సమయం వృథా: ప్రతి దానికి స్క్రోల్ చేయడం వల్ల బిడ్డతో గడపాల్సిన క్వాలిటీ టైమ్ కోల్పోతున్నారు. దీంతో ఈ ఒత్తిడి కేవలం తల్లిదండ్రులపైనే కాదు, పిల్లలపైనా పడుతున్నది.

పిల్లలతో డిస్‌కనెక్ట్: తల్లిదండ్రులు ఫోన్‌తో అతిగా ఇంటరాక్ట్ కావడం వల్ల.. బిడ్డతో నాణ్యమైన నేచురల్ కమ్యూనికేషన్ చేయలేకపోతున్నారు. ఈ మార్పు తల్లీబిడ్డల మధ్య ఉండే సృజనాత్మక, భావోద్వేగ పూరితమైన రిలేషన్‌ని తగ్గిస్తుంది.

ప్రైవసీ కోల్పోవడం: తమ వ్యక్తిగత విషయాలను అతిగా ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడం వల్ల బిడ్డ ప్రైవసీని తెలియకుండానే బహిర్గతం చేస్తున్నారు.

సింపుల్‌గా చెప్పాలంటే.. పిల్లల పెంపకం అంటే ఒక రీల్ చేయడం కాదు, అది ఒక రియల్ జర్నీ. బాధ్యతతో కూడిన పేరెంటింగే మీ బిడ్డలకు శ్రీరామరక్ష.



## మంచు వాకిట.. బౌద్ధం

హిమగిరుల్లో దౌళాధర్ పర్వశ్రేణులు ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. ధవళ వర్ణంలో మెరిసిపోయే పర్వతాలు.. ఉభయ సంధ్యల్లో అరుణ కాంతులీనుతూ దర్శనమిస్తాయి. ఈ పర్వతాల చెంతనున్న కాంగ్డా లోయ మరో అద్భుతం. కాంగ్డా జిల్లా కేంద్రమైన ధర్మశాలలో అడుగడుగునా సంప్రదాయం పలకరిస్తుంది. అక్కడక్కడా ఆధునికత తొంగిచూస్తుంది. ఇక్కడికి వచ్చే పర్యాటకులు కాసేపు ఆరామాల్లో ధ్యానం చేస్తారు. జలపాతాల్లో కేరింతలు కొడతారు. సరస్సుల్లో బోటు షికారు చేస్తారు. తేయాకు తోటల్లో విహరిస్తారు. కొండల్లో సాహసయాత్రకు పూనుకుంటారు.

ధర్మశాలలో బౌద్ధమతం వేళ్లూనుకున్నా.. ఇతర మతాల అనవాళ్లూ కనిపిస్తాయి. కాంగ్డా కోటలో, ధర్మశాల పరిసర ప్రాంతాల్లో హిందూ దేవాలయాలు కోకొల్లలు. పురాతమైన చర్చి అపురూప నిర్మాణం అందరినీ అలరిస్తుంది. ధర్మశాల రెండు భాగాలుగా ఉంటుంది. దిగువ ధర్మశాల వాణిజ్య కేంద్రాలు, అంగళ్లతో అతిథులకు తీరిక లేకుండా చేస్తుంది. ఎగువ ధర్మశాల ఆరామాలతో, పర్యాటక విశేషాలతో స్వాగతిస్తుంది. ధర్మశాలను అభివృద్ధి చేసిన పంజాబ్ గవర్నర్ సర్ డొనాల్డ్ మెక్డ్ పేరిట ఏర్పడిన 'మెక్డ్ గంజ్' హస్తకళలకు కేరాఫ్‌గా నిలుస్తుంది.

ధర్మశాల వచ్చే పర్యాటకులు తప్పకుండా సందర్శించే ప్రాంతం త్సుగ్లఖంగ్ కాంప్లెక్స్. బౌద్ధ ఆరామాల సమూహమిది. ఇక్కడే దలైలామా ఆవాసం ఉంటుంది. కాలచక్ర ఆలయాన్ని, టిబెటన్ మ్యూజియం కూడా సందర్శించవచ్చు. వందల మంది బౌద్ధ భిక్షువులు కనిపిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే దలైలామాను చూసే అవకాశం కలుగుతుంది.

ధర్మశాలకు 46 కిలోమీటర్ల దూరంలో కాంగ్డా లోయ సమీపంలో ఉన్న అందమైన గుహాలయం మస్రూర్. కోనేటి ఒడ్డున.. అద్భుతమైన శిల్ప సంపదతో అలారారుతున్న ఈ ఆలయం ఎల్లోరా అందాలను మరిపిస్తుంది. దీనిని ఎనిమిదో శతాబ్దంలో నిర్మించినట్టు చెబుతారు. ఇలా ధర్మశాలతో పాటు పరిసరాల్లో ఎన్నెన్నో అద్భుత విహార కేంద్రాలు ఉన్నాయి. వేసవి విడిదిగా పేరున్న ధర్మశాల.. శీతాకాలంలో మరింత మనోహరంగా దర్శనమిస్తుంది.

# 'పిల్లల' యమ డేంజర్

అప్పుడెప్పుడో ఓ సినిమాలో 'తూనీగా.. తూనీగా..' అంటూ ఇద్దరు పిల్లలు ప్రేమ ఖతం పాడుకుంటే ఇష్టంగా చూశాం. సినిమాని హిట్ చేసేశాం. దాని గురించి మరిచిపోయాం. పిల్లలు మాత్రం మర్చిపోలేదు. వయసుతో సంబంధం లేకుండా ప్రేమించేయొచ్చు అని నేర్చుకున్నారు. ఏడో క్లాస్ నుంచే లవ్‌లో పడటం స్టార్ట్ చేసేశారు. ఈ తొందరపాటు అనేక సమస్యలను తెచ్చి పెట్టడం చూస్తూనే ఉన్నాం. ఈ ప్రేమల వల్ల కలిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు!

మారుతున్న జీవనశైలి, సోషల్ మీడియా ప్రభావం, పిల్లల జీవితాలపై బలంగా పడుతున్నది. పాత కాలంలో టీనేజ్ (13–19 సంవత్సరాలు) దాటిన తర్వాత ప్రేమ, ఆకర్షణ వంటి భావనలు మొదలయ్యేవి. కానీ ప్రస్తుత తరంలో కౌమార దశకు చేరుకోకముందే, అంటే 10 నుంచి 12 సంవత్సరాల వయసులోనే పిల్లలు ఒకరిపై ఒకరు ఆకర్షణ పెంచుకోవడం, 'ప్రేమ' అనే పదాన్ని ఉపయోగించడం మనం చూస్తున్నాం. ఇది సమాజంలో ఆందోళన కలిగించే అంశంగా మారుతున్నది.


ప్రధాన కారణాలు ఏమిటి?

సోషల్ మీడియా–ఓటీటీ సినిమాలు, టీవీ సిరీస్‌లు, ఇంటర్నెట్‌లో వచ్చే కంటెంట్ ద్వారా ప్రేమ, రిలేషన్‌షిప్‌ల గురించి వారికి వాస్తవానికి భిన్నమైన, అపరిపక్వమైన ఆలోచనలు కలుగుతున్నాయి. టీనేజ్ డ్రామాలు, రొమాంటిక్ కంటెంట్ చిన్న వయసులోనే రిలేషన్‌షిప్‌లు సాధారణమనే భావనను కలిగిస్తున్నాయి.

ఎదుగుదల ప్రక్రియ పిల్లలు శారీరకంగా, మానసికంగా వేగంగా ఎదుగుతున్నారు. దీనికి హార్మోన్ల మార్పులూ ఒక కారణం. ఇవి వారిలో ఇతరుల పట్ల ఆకర్షణను పెంచుతాయి.

కుటుంబ వాతావరణం : కొందరు పిల్లలు ఇంట్లో ఆప్యాయత లేమి, ఒంటరితనం వంటివి అనుభవించినప్పుడు, ఆ ఖాళీని నింపుకోవడానికి ఇతరులతో 'క్లోజ్' అవ్వాలని చూస్తారు.

పీర్ గ్రూప్ ప్రభావం తమ స్నేహితులు ఒకరితో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు, తాము కూడా ఉండాలనే ఒత్తిడి, కోరిక పిల్లల్లో పెరుగుతుంది.



## ఇవీ చిక్కులు..

చిన్న వయసులో రిలేషన్‌షిప్‌లు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపవచ్చు, వారి మెదడు పని తీరు కూడా మారే ప్రమాదం ఉంది.

రిలేషన్‌షిప్ ఆలోచనలు, సమస్యలు, చాటింగ్‌కు ఎక్కువ సమయం కేటాయించడం వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతుంది.

బ్రేకప్‌లు లేదా చిన్న చిన్న గొడవలు కూడా వారి లేత మనసుపై పెద్ద ఒత్తిడిని, డిప్రెషన్‌ను కలిగిస్తాయి.

వారికి ప్రేమ, బాధ్యత, లైంగికత వంటి విషయాలపై సరైన అవగాహన ఉండదు. దీనివల్ల ముప్పుతో కూడిన నిర్ణయాలు తీసుకునే అవకాశం పెరుగుతుంది.

కుటుంబ సభ్యులు, పాత స్నేహితుల నుంచి దూరం పెరిగి, రిలేషన్‌షిప్‌కు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుంటారు.

మెదడుపై ప్రభావం ఇలా..

కౌమారదశలో ప్రేమ, ఆకర్షణ వంటి భావాలు మెదడుపై తీవ్రమైన రసాయన, నిర్మాణపరమైన మార్పులను కలిగిస్తాయి. ఈ వయసులో మెదడు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందుతూ ఉంటుంది కాబట్టి, ఈ అనుభవాలు పిల్లల ఆలోచనలు, నిర్ణయాలు, భావోద్వేగాలపై లోతైన ముద్ర వేస్తాయి.

## డోపమైన్ వలలో..

ప్రేమలో పడినప్పుడు, ముఖ్యంగా టీనేజ్‌లో, మెదడులో డోపమైన్ అనే రసాయనం అధికంగా విడుదలవుతుంది. ఇది మెదడులోని 'రివార్డ్ సిస్టమ్'ను ఉత్తేజపరుస్తుంది. డోపమైన్ విడుదల వల్ల పిల్లలు అమితమైన ఆనందం, ఉత్సాహం అనుభవిస్తారు. ఈ అనుభూతి చాలా శక్తిమంతంగా ఉంటుంది, కొన్నిసార్లు ఇది డ్రగ్స్ వాడినప్పుడు కలిగే అనుభూతితో సమానంగా ఉంటుంది. దీనివల్ల వారు తమ భాగస్వామి గురించి పదేపదే ఆలోచించడం, వారితోనే ఎక్కువ సమయం గడపాలని కోరుకోవడం వంటి అబ్సెసివ్ ప్రవర్తన చూపవచ్చు. బంధంలో సమస్యలు వచ్చినప్పుడు లేదా విఫలమైనప్పుడు, కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లు విడుదలవుతాయి. ఇది తీవ్రమైన బాధ, నిరాశ, ఆందోళనకు దారితీస్తుంది.

## మెదడు నిర్మాణంపై..

టీనేజ్‌లో మెదడులోని రెండు ముఖ్యమైన భాగాలు వేర్వేరు వేగంతో అభివృద్ధి చెందుతాయి. లింబిక్ సిస్టమ్ భావోద్వేగాలు, ప్రేరణ, రివార్డ్‌లకు సంబంధించిన భాగం. ఇది కౌమారదశ ప్రారంభంలోనే చురుకుగా మారుతుంది. అందువల్లే, టీనేజర్లు త్వరగా, తీవ్రమైన భావోద్వేగాలకు లోనవుతారు.

ప్రీఫ్రాంటల్ కార్టెక్స్ తార్కిక ఆలోచన, నిర్ణయం తీసుకోవడం, ప్రేరణ నియంత్రణ వంటి ఉన్నత స్థాయి ఆలోచనా సామర్థ్యాలకు బాధ్యత వహిస్తుంది. ఈ భాగం సుమారు 25–30 సంవత్సరాల వయసు వరకు పూర్తిగా అభివృద్ధి చెందదు. ప్రేమలో ఉన్నప్పుడు, మెదడులోని ప్రీఫ్రాంటల్ కార్టెక్స్ కంటే లింబిక్ సిస్టమ్ ఆధిపత్యం వహిస్తుంది. అందువల్ల పిల్లలు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాల ఆధారంగా పనిచేయడం, మంచి–చెడులను సరిగా అంచనా వేయలేకపోవడం జరుగుతుంది. మెదడు ఇంకా పరిపక్వం చెందకపోవడం వల్ల బంధాలలో వచ్చే చిన్న మార్పులు కూడా వారి మానసిక ఆరోగ్యంపై పెద్ద ప్రభావాన్ని చూపుతాయి. విపరీతమైన ఆనందం నుంచి తీవ్రమైన నిరాశకు త్వరగా మారే అవకాశం ఉంటుంది.

## ఏం చేయాలి?

లేత ప్రేమలకు పిల్లలను నిందించడం కాదు, వారిని అర్థం చేసుకోవడం మాత్రమే సమస్య మూలాలను మారుస్తుంది.

1. స్నేహపూర్వక సంభాషణ పిల్లలతో నిత్యం మాట్లాడాలి. వారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి. శిక్షించడం లేదా విమర్శించడం కాకుండా, వారికి ఏమైనా సమస్య ఉంటే మీతో చెప్పుకునేంత నమ్మకాన్ని పెంచాలి.
2. అవగాహన చిన్న వయసులో కలిగే ఆకర్షణ అనేది సహజమని, కానీ అది ఇప్పుడే రిలేషన్‌షిప్‌గా మారాల్సిన అవసరం లేదని వారికి వివరించాలి. 'స్వయం–ప్రేమ', లక్ష్యాల ప్రాముఖ్యతను బోధించాలి.
3. స్క్రీన్ టైమ్‌పై నియంత్రణ పిల్లలు చూసే కంటెంట్‌ను గమనించాలి. సోషల్‌మీడియా, ఇంటర్నెట్ వాడకానికి ఒక సమయ పరిమితిని విధించాలి.
4. ఆసక్తికరమైన కార్యకలాపాలు పిల్లలను ఆటలు, సంగీతం లేదా ఏదైనా కొత్త నైపుణ్యాన్ని నేర్చుకునేలా ప్రోత్సహించాలి. దీనివల్ల వారి శక్తి నిర్మాణాత్మకమైన పనుల వైపు మళ్లుతుంది.
5. లైంగిక విద్య తల్లిదండ్రులు లైంగిక విద్య గురించి మాట్లాడటానికి సంకోచించకూడదు. లైంగిక ఆరోగ్యానికి సంబంధించిన సరైన సమాచారాన్ని వారికే అందించాలి, అప్పుడే వారు తప్పుడు సమాచారం నుంచి రక్షణ పొందుతారు.

# మొక్కజొన్న రైతులకు బాసట

- మద్దులపల్లి మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఖమ్మం, ఏప్రిల్ 04:**

రైతులు పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి మార్కెట్ లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనితతో కలిసి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



**శుభకార్యక్రమలకు హాజరు**

అలాగే కూసుమంచి మండలం లోక్య తండా గ్రామంలో జరిగిన పలు వివాహ వేడుకలకు తుంబూరు దయాకర్ రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో లబ్ధిదారుడు దండి రామారావు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కూసుమంచి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాంపు కార్యాలయం పై దాడి ఖండన

- గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి ఆరోపణ
- ప్రజాస్వామ్యంపై దాడి, శాంతి భద్రతలపై ప్రశ్నలు

**సహస్ర గళం, దమ్మపేట, ఏప్రిల్ 04:**



ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ కు సంబంధించిన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాలు దాడి చేసిన ఘటనను బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే జరిగిందని ఆరోపించారు.పట్టపగలు అధికార మదంతో వ్యవహరిస్తూ ప్రజా స్వామ్యాన్ని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాలపైనే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా అన్న సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యంగా మారాయని విమర్శించారు.శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఒకవైపు హేట్ స్పీచ్ బిల్ పేరుతో ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు దాడులు జరుగుతుండటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో రాజకీయ కార్యక్రమాల్లో నిమగ్నమవుతూ పాలనను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని తెలంగాణ డీజీపీని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు కొనసాగితే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# డిసిసిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**అశ్వారావుపేట మండలకేంద్రంలో నిర్వహిస్తున్న సీజన్-2 ప్రారంభం**



**అశ్వారావుపేట, ఏప్రిల్ 04:**

అశ్వారావుపేట మండలకేంద్రంలో డ్రైవర్స్ కాలనీ యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిసిసిఎల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 ను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభించారు.అనంతరం నందమూరి నగర్‌లో తాణికొండ సత్యనారాయణ అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జూపల్లి ప్రమోద్, మిండా హరిబాబు, సూరనేని ఫణి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# పరామర్శలు, శాంతిర్యాలీ

**అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కుటుంబాలను ఓదార్చి శాంతి పిలుపు**

**సహస్ర గళం, దమ్మపేట, ఏప్రిల్ 04:**

అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఇటీవల మరణించిన పలువురు కుటుంబాలను దమ్మపేట మండల కేంద్రంలో పరామర్శించారు. పసుమర్తి చిన్నబాబు, అబ్దుల్ జిన్నా అమ్మ, ఎండి వలి పాషా అమ్మ, గోవిందాచారి కుమార్తెలను సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.అనంతరం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత ర్యాలీలో పాల్గొని సమాజంలో శాంతి, ఐక్యత అవసరమని, అందరూ కలిసికట్టుగా వాతావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు చిన్నశెట్టి చిట్టిబాబు, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై దాడి ఖండన

- దాడులతో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అపహాస్యం

**ఖమ్మం, ఏప్రిల్ 04:**



గజ్వేల్ లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వంలోని పార్టీ నేతలు రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం దాడులు చేయడం సరికాదన్నారు. ఈ తరహా దాడులు, విధ్వంసాలతో ప్రజలను ప్రతిపక్ష పార్టీలపై భయభ్రాంతులకు గురిచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. భయపెట్టి దాడులు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర అని ఆరోపించారు.

# కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించిన

- మాజీ ఎంపీ నామ

**ఖమ్మం, ఏప్రిల్ 04:**



గజ్వేల్‌లో ప్రధాన ప్రతిపక్ష నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల కార్యాలయాలపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలుస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలు హింసకు దారి తీయకూడదని, ఇలాంటి ఘటనలు జరగడం సరైంది కాదని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధుల కార్యాలయాల భద్రత బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# రన్ ఫర్ జీసస్ అశ్వారావుపేట




- క్రైస్తవ ఐక్యతలో కార్యక్రమం

**అశ్వారావుపేట, ఏప్రిల్ 04:**

అశ్వారావుపేట సి ఎస్ ఐ టౌన్ చర్చి ఆధ్వర్యంలో శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు స్వయంగా ప్రారంభించి ప్రత్యేకంగా భాగస్వామ్యం చేశారు. క్రైస్తవ సోదరులు ఐక్యంగా పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరు తమ మతాన్ని ప్రేమించి పరమతాన్ని గౌరవించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సి ఎస్ ఐ టౌన్ చర్చి ఫాదర్, సభ్యులు, సంఘస్తులు, మండలంలోని పాస్టర్లు, చర్చిల క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి



- లీకేజీలు, మరమ్మత్తులు వేగవంతం
- ప్రజల సహకారం ద్వారా నీటి వృథా నివారణ

**బోనకల్, ఏప్రిల్ 04:**

గోవిందాపురం ఎల్ గ్రామం గ్రామపంచాయతీ సర్పంచ్ మందా కరుణ శనివారం తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి వార్డుకు శుద్ధి నీరు అందేలా పంచాయతీ చర్యలు చేపట్టింది. పగిలిన పైపు లైన్లు వెంటనే మరమ్మత్తులు చేసి, లీకేజీల నివారణ పనులను వేగవంతం చేశారు.సర్పంచ్ పిలుపునిచ్చి, తాగునీటిని వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఈ వనరును కాపాడడానికి ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే మురళి, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, వార్డు సభ్యులు ఇరుగు రమేష్, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ బిఆర్ఎస్ క్యాంపు దాడి ఖండన

- కాంగ్రెస్ గూండాల దాడి అప్రజాస్వామికం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**అశ్వారావుపేట, ఏప్రిల్ 04:**



గజ్వేల్‌లో కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం అప్రజాస్వామికమని అశ్వారావుపేట బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు సత్యవరుపు సంపూర్ణ తీవ్రంగా ఖండించారు. పార్టీ ప్రకటన ప్రకారం, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి దాడుల సంస్కృతి పెరిగింది. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజాస్వామ్యానికి ఘాతుకరమని, బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు ప్రజలను భయపెట్టే కుట్రలను గట్టిగా ఎదుర్కోవాలని సూచించారు.

## జర్నలిస్టుల సమస్యలపై ఆందోళన

**ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్యంపై హెచ్చరిక**



**ఖమ్మం, ఏప్రిల్ 04:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యుజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య ఖమ్మం జిల్లా సర్వసభ్య సమావేశంలో పాల్గొని, జర్నలిస్టులపై ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్యాన్ని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నూతన అధ్యక్షుడిగా నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అర్వపల్లి నగేష్, కోశాధికారి గా వేములకొండ రమేష్ కుమార్, పూర్తి కమిటీ ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. మామిడి సోమయ్య సూచించిన విధంగా, అక్రిడిటేషన్ కార్డులు, మ్యానిఫెస్టో అంశాలు, పెండింగ్ ఇళ్ళస్థల సమస్యలపై తక్షణ పరిష్కారం డిమాండ్ చేశారు.

# విశ్వశాంతి లో హిడెన్ టాలెంట్ షో

- విద్యార్థుల ప్రతిభకు వేదిక

**సత్తుపల్లి, ఏప్రిల్ 04:**

విద్యార్థులలో దాగిన ప్రతిభను వెలికి తీయడానికి విశ్వశాంతి విద్యాలయంలో శనివారం "హిడెన్ టాలెంట్ షో" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమలో దాగిన ప్రతిభను ప్రదర్శించారు. ఈ టాలెంట్ షోలో జానపద నృత్యం, ట్రెడిషనల్ ఫ్యాషన్ షో, గానం, నాటకం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ కన్వర్జేషన్, నీతి కథలు, మిమిక్రీ , పన్నీ పోయెమ్, పేరడీ, భగవద్గీత శ్లోకాలు తదితర విభాగాలలో విద్యార్థులు తమ నైపుణ్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. కొంతమంది విద్యార్థులు ఇప్పటివరకు బయటపడని తమ అంతర్గత ప్రతిభను ఈ వేదికపై ప్రదర్శించి ఆకట్టుకున్నారు.




**ప్రతిభను గుర్తించేందుకు..**

విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వర రావు మాట్లాడుతూ..ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, సృజనాత్మకతను అభివృద్ధి చేయడం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్, క్రియేటివిటీ, టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు."ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుంది. సరైన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు చేయగలరు. ఈ హిడెన్ టాలెంట్ షో ద్వారా విద్యార్థులు తమ సామర్థ్యాన్ని గుర్తించుకుని భవిష్యత్తులో మరింత ఎదగాలని ఆశిస్తున్నాము" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ హిడెన్ టాలెంట్ షో ఒక కొత్త దిశను చూపిన స్ఫూర్తిదాయక కార్యక్రమంగా నిలిచింది.

# క్యాంపు దాడి నిరసన

- మాజీ సీఎం కార్యాలయంపై హేయమైన దాడి

**కొత్తగూడెం, ఏప్రిల్ 04:**

కొత్తగూడెం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన జరిగింది. మాజీ చైర్ పర్సన్ సీతాలక్ష్మి మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రాష్ట్ర సాధకుడు కేసీఆర్ కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు.కాంగ్రెస్ గూడాలు మాత్రమే దాడికి పాల్పడటమే కాక, పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆమె మండిపడ్డారు. వెంటనే దాడి చేసినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసనలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చింతలపూడి జగన్, చల్ది రవి, కార్తీక్, కిషోర్, రాజు, సాజిత్, ఆసిఫ్ జానీ, పులి వెంకటేష్, ప్రదీప్, ఇర్ఫాన్, గాజుల కృష్ణ, వెంకటేష్, అమన్, మద్దెల సుధీర్, పూర్ణచందర్, జనిత్, హరి, షణ్ముఖ సాయి తదితరులు పాల్గొన్నారు.




# నరాలు తెగే ఉత్కంఠ.. నెగ్గిన రాజస్థాన్!

## అహ్మదాబాద్‌లో పరుగుల వరద.. ఆఖర్లో ఆర్ఆర్ దే విజయం

### దంచికొట్టిన ధ్రువ్ జురెల్, జైస్వాల్

### నాలుగు వికెట్లతో జీటీని దెబ్బకొట్టిన రవి బిష్ణోయ్

### ఆఖరి వరకు పోరాడి ఓడిన గుజరాత్ టైటాన్స్

**అహ్మదాబాద్ :** ఐపీఎల్ టోర్నీలో భాగంగా అహ్మదాబాద్ నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా శనివారం జరిగిన మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ పై రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయం సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ హై స్కోరింగ్ పోరులో ఆఖరి వరకు పోరాడిన జీటీ కేవలం 6 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్ఆర్ భారీ స్కోరు సాధించగా.. లక్ష్య ఛేదనలో జీటీ తడబడింది.



### ఆకాశమే హద్దుగా ఆర్ఆర్ బ్యాటింగ్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 36 బంతుల్లో 55 పరుగులతో శుభారంభం అందించగా.. ఆ తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 42 బంతుల్లోనే 75 పరుగులు సాధించి జీటీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. చివర్లో వైభవ్ సూర్యవంశీ 18 బంతుల్లో 31 పరుగులతో రాణించాడు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబడ 2 వికెట్లు తీయగా.. అశోక్ శర్మ, రషీద్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు.

### పోరాడి ఓడిన జీటీ

211 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ అద్భుతమైన ఇన్నింగ్స్ తో ఆశలు రేపాడు. 44 బంతుల్లో 73 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా జోస్ బట్లర్ 14 బంతుల్లో 26 పరుగులు, రషీద్ ఖాన్ 16 బంతుల్లో 24 పరుగులతో రాణించినా లాభం దక్కలేదు. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో నిర్ణీత 20 ఓవర్లలో జీటీ 8 వికెట్లు కోల్పోయి 204 పరుగులకే పరిమితమైంది.

### బిష్ణోయ్ స్పిన్ ఉచ్చు

ఆర్ఆర్ బౌలర్లలో స్పిన్నర్ రవి బిష్ణోయ్ అద్భుత ప్రదర్శన చేశాడు. కీలక సమయంలో వికెట్లు పడగొట్టి గుజరాత్ బ్యాటింగ్ లైనప్ ను దెబ్బతీశాడు. తన 4 ఓవర్ల కోటాలో 41 పరుగులిచ్చి ఏకంగా 4 వికెట్లు పడగొట్టి ఆర్ఆర్ విజయానికి బాటలు వేశాడు. తుషార్ దేశ్ పాండే, రియాన్ పరాగ్ చెరో వికెట్ తీసి అతనికి చక్కని సహకారం అందించారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన రాజస్థాన్ రాయల్స్ సూపర్ విక్టరీని తమ ఖాతాలో వేసుకుంది.

# సెమీస్‌కు నిఖత్..

## భారత్‌కు మూడు పతకాలు ఖాయం

### ప్రియా, ప్రీతి జోరు

**ఉలన్‌బాతర్ :** ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు అదరగొడుతున్నారు. టోర్నీ ఐదో రోజు తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌తో పాటు ప్రియా, ప్రీతి పవార్ సైతం సెమీస్‌కు చేరి దేశానికి మూడు పతకాలు ఖాయం చేశారు. మహిళల 51 కిలోల క్యాటగిరీ క్వార్టర్ బౌట్‌లో ఆదినుంచే పూర్తి నియంత్రణతో ఆడిన నిఖత్.. రిఫరీ స్టాప్ కాంటెస్ట్ (ఆర్ఎఫ్‌సీ)తో ఫిలిప్పీన్స్‌కు చెందిన జియాన్ బగుహిన్‌ను ఓడించి సెమీస్ చేరింది. సెమీస్‌లో ఈ తెలంగాణ అమ్మాయి.. 2024 ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ అయిన వు యు (చైనా)తో అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల 60 కిలోల విభాగంలో ప్రియ.. 4-1తో చెంగ్యు యాంగ్ (చైనా)ను చిత్తుచేసింది. ఫైనల్ బెర్తు కోసం ఆమె సెమీస్‌లో నమున్ మొంఖోర్ (మంగోలియా)తో తలపడుతుంది. 54 కేజీల క్యాటగిరీలో వరల్డ్ బాక్సింగ్ కప్ స్వర్ణ విజేత ప్రీతి.. 5-0తో మంగున్ సెత్సెగ్ (మంగోలియా)ను మట్టికరిపించి సెమీస్‌కు అర్హత సాధించింది.



# రిజ్వీ రాంపేజ్.. ముంబై పల్టీ!



## ఢిల్లీ క్యాపిటల్స్ ఆరు వికెట్ల ఘన విజయం

### 51 బంతుల్లో 90 పరుగులతో చెలరేగిన సమీర్ రిజ్వీ

### వృథా అయిన సూర్యకుమార్, రోహిత్ శర్మ పోరాటం

### సొంత గడ్డపై సత్తా చాటిన ఢిల్లీ బౌలర్లు, బ్యాటర్లు

**ఢిల్లీ, ఏప్రిల్ 4:** ఐపీఎల్ టోర్నీలో భాగంగా శనివారం అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం సాధించింది. ముంబై ఇండియన్స్ తో జరిగిన పోరులో ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ బ్యాటర్ సమీర్ రిజ్వీ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆ జట్టు కేవలం 18.1 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసి లక్ష్యాన్ని ముద్దాడింది. మరో 11 బంతులు మిగిలి ఉండగానే ఢిల్లీ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.



### సూర్యకుమార్ హాఫ్ సెంచరీ

అంతకుముందు టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇండియన్స్ కు శుభారంభం దక్కింది. స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 36 బంతుల్లో 51 పరుగులతో అదరగొట్టాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 26 బంతుల్లో 35 పరుగులతో రాణించాడు. యువ ఆటగాడు నమన్ ధీర్ 21 బంతుల్లో 28 పరుగులు సాధించాడు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించకపోవడంతో ముంబై 162 పరుగులకే పరిమితమైంది. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్ మూడు ఓవర్లలో 26 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లలో 22 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. విప్రాజ్ నిగమ్ మూడు ఓవర్లలో 24 పరుగులిచ్చి ఒక వికెట్ దక్కించుకున్నాడు. కట్టుదిట్టమైన బౌలింగ్ తో ముంబై భారీ స్కోరు చేయకుండా ఢిల్లీ బౌలర్లు అడ్డుకున్నారు.



### తేలిపోయిన ముంబై బౌలర్లు

ఢిల్లీ బ్యాటర్ల ధాటికి ముంబై బౌలర్లు చేతులెత్తేశారు. దీపక్ చాహర్ మూడు ఓవర్లలో 20 పరుగులిచ్చి ఒక వికెట్, మిచెల్ శాంట్నర్ మూడు ఓవర్లలో 22 పరుగులిచ్చి ఒక వికెట్ మాత్రమే తీశారు. కార్బిన్ బాష్ 3.1 ఓవర్లలో ఏకంగా 39 పరుగులు సమర్పించుకుని ఒక వికెట్ పడగొట్టాడు. రిజ్వీ దెబ్బకు బౌలర్ల వ్యూహాలన్నీ బెడిసికొట్టాయి. అద్భుతమైన బ్యాటింగ్ తో ఒంటిచేత్తో ఢిల్లీకి విజయాన్ని అందించిన సమీర్ రిజ్వీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.



### సమీర్ రిజ్వీ విధ్వంసం

163 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు సమీర్ రిజ్వీ అద్భుతమైన ఇన్నింగ్స్ తో విజయాన్ని కట్టబెట్టాడు. ముంబై బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 51 బంతుల్లోనే 90 పరుగులు చేశాడు. సెంచరీకి చేరువలో అవుటైనప్పటికీ జట్టుకు సునాయాస విజయాన్ని అందించాడు. అతడికి జతగా ఓపెనర్ పాతుమ్ నిస్సాంక 30 బంతుల్లో 44 పరుగులతో మంచి పునాది వేశాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ 18 బంతుల 21 పరుగులతో అజేయంగా నిలిచి లాంఛనాన్ని పూర్తి చేశాడు.






# ఆది కొత్త సినిమా సైరాబాను

**క్లాప్ కొట్టిన నటుడు కిరణ్ అబ్బవరం**


టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంఇతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.



## ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో..

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సం' తం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉ పశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.

## పాకెట్ నవల్ మూవీతో ఎంతో నేర్చుకున్నా



**నటి మాళవికా మోహనన్**

ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉ పశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.




## ఓటీటీలోకి ఎస్ సరస్వతి మూవీ

ఓటీటీలోకి ఎస్ సరస్వతి మూవీ

వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ఎస్. సరస్వతి'. గత నెల మార్చి 6న థియేటర్లలో విడుదలై ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమ్రింగ్ అవుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, జీవా, మురళీ శర్మ, రావు రమేశ్, రాధికా శరత్‌కుమార్ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. కథ విషయానికి వస్తే, లక్ష్మి అనే ఓ అనాథ మహిళ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ తన కూతురు 'ఎస్. సరస్వతి'ని ఎంతో ప్రేమగా పెంచుకుంటుంది. అయితే ఆగస్టు 15న తన కూతురిని స్కూల్లో దించి ఉద్యోగానికి వెళ్లిన లక్ష్మి.. ఆ తర్వాత తన కూతురు కనిపించడం లేదని, స్కూల్లోనే ఆమెపై అఘాయిత్యం జరిగిందని పోలీసులను ఆశ్రయిస్తుంది. పోలీసులు విచారించగా అసలు అలాంటి పాపే ఆ స్కూల్లో లేదని తేలడంతో కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఇంతకీ ఆ పాప ఏమైంది, లక్ష్మి చెబుతున్నది నిజమా లేక ఇదంతా ఆమె భ్రమా అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సస్పెన్స్ థ్రిల్లర్ సాగుతుంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు ఇప్పుడు నేరుగా ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

PRINTED, PUBLISHED AND OWNED BY **MOHAMMED IMRAN,** PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. **EDITOR : MOHAMMED IMRAN,** RNI. NO. **TELTEL/2006/16536**